

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శుక్రవారం, 25 ఏప్రిల్ 2025 — 8 పేజీలు

ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా విధులు నిర్వర్తించాలి

విశాలాంధ్ర-రాయచోటి: పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని, అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటాద్రి పోలీస్ అధికా రులను ఆదేశించారు. గురువారం రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో మదనపల్లి సబ్ డివిజన్ పోలీసు అధికారులకు నేర సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లా డుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఆదే శించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించా లని, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. చైన్ స్నాచింగ్ లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలు, నిషేదిత మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. మదనపల్లె డిఎస్పీ ఎస్.మహేంద్ర, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల సాధికారతతోనే.. రాష్ట్ర సాధికారిత సాధ్యం

- రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ
- ఎంపవర్మెంట్ అండ్ రిలేషన్స్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ల సాధికారతతోనే.. రాష్ట్ర సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అవుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ. ఎంపవర్మెంట్ అండ్ రిలేషన్స్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ ఎస్ హాలులో.. జిల్లాలో ఎంఎస్ఎంఈ, సెర్ప్ కార్యకలాపాలపై.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, రాష్ట్ర ప్రభుత్వ విప్‌లు, కడప, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు ఆర్.మాధవి రెడ్డి, సీ.ఆదినారాయణ రెడ్డి, జేసి అదితిసింగ్‌లతో కలిసి రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ. ఎంపవర్మెంట్ రిలేషన్స్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో 10 లక్షల నుండి 120 కోట్ల పెట్టుబడితో నిర్వహించే ప్రతి పరిశ్రమను సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల క్రింద చేర్చడం జగిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు.. దేశం సర్వతో ముఖాభివృద్ధి చెందాలంటే.. భారీ పరిశ్రమలతో పాటు ఎంఎస్ఎంఈ ల పురోభివృద్ధి కూడా ఎంతో ముఖ్యం అన్నారు. పరిశ్రమలలో ఒక భాగంగా ఉన్న ఎంఎస్ఎంఈ విభాగాన్ని.. ఒక ప్రత్యేక పారిశ్రామిక రంగంగా ఒక పాలసీని తీసుకురావడం, అందుకు సంబంధించి "ఉద్యం" పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతోందన్నారు. ఒక వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరు ఉద్యం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని.. ప్రభుత్వం నుండి అందే అన్ని రకాల రాయితీలను పొందేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కడప జిల్లా పరిశ్రమల గురించి ప్రస్తావిస్తూ ఈ జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలో జరుగుతున్న మహిళాభివృద్ధి, సంకేమ కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందన్నారు. పిఎమ్ఈజిపి, పిఎమ్ విశ్వకర్మ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎంటర్ప్రెన్యూర్ షిప్ ను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామిక వేత్త తయారు కావలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష అని... ఆ దిశగా మహిళలను యువతను జిల్లా అధికారులు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని మహిళా పొదుపు సంఘాలను ఈ-కామర్స్ బిజినెస్ వైపు అడుగులు వేయించి.. ప్రపంచ గుర్తింపుతో పాటు.. సంపూర్ణ సాధికారిత సాధించేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ... స్థానికంగా ఉన్న ఇండస్ట్రీలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఇండస్ట్రీలో మ్యాన్ పవర్ అవసరం చాలా ఎక్కువగా ఉందన్నారు. స్థానిక యువత లోకల్ గా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డిలు మాట్లాడుతూ... దేశంలోనే మొట్టమొదటిగా స్వయం సహాయక సంఘాల వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అంతకు ముందు.. కొప్పర్తి లోని 540 ఎకరాల్లో ఏర్పాటైన మెగా ఇండస్ట్రియల్ హబ్ లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ లో నిర్మించిన యూనిట్లను రాష్ట్ర మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపి ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, ఇండస్ట్రియల్ జీఎం చంద్ బాషా, డిఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, డిపిఎంలు, ఏపిడిలు, మెప్మా సిఎంఎంలు, సెర్ప్ సిబ్బంది సంబందిత శాఖల అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం: మంత్రి మండిపల్లి

విశాలాంధ్ర-రామాపురం: మండలంలో గతంలో ఎన్నడు లేని విధంగా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నడూ లేని విధంగా గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి అవసరాల కోసం కోట్లాది రూపాయలకు ఖర్చు చేస్తున్నామని రవాణా యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.గురువారం మండలంలోని సుద్దమల్ల పంచాయతీ ఓబుల్ రెడ్డి గారి పల్లెలోరూ. 22 లక్షల రూపాయల నిధులతో గ్రామానికి బోర్ తో పాటు 3 కిలోమీటర్ల మేర పైప్ లైన్ తో నీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామాన్ని గుర్తించి అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 230 బోర్డులు వేయడం జరిగిందన్నారు. మరెన్నో బోర్లు వేస్తామని మరి నీరు పడనచోట ట్యాంకర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు.

మండిపల్లికి ఘన స్వాగతం

ఓబుల్ రెడ్డి గారి పల్లెకు స్కీం ప్రారంభించడానికి వచ్చిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఆ గ్రామానికి చెందిన నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలు నుంచి తాగునీటి కోసం ఇబ్బంది పడే వారమని మీ కృషితో మాకు సమృద్ధిగా నీరు పడడం చాలా సంతోషంగా ఉందన్నారు .ఎక్కువ నిధులతో పైప్ లైన్ ఇవ్వడం ఆనందంగా ఉందని ఎప్పుడు రుణపడి ఉంటామన్నారు.

బిందెలకు నీళ్లు పట్టించిన మంత్రి

ఓబుల్ రెడ్డి గారి పల్లెలో స్కీమ్ బోర్డు ప్రారంభించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమీపంలోని కుళాయి వద్ద కొల్లాయిని ఓపెన్ చేసి మహిళలకు బిందెలకు నీళ్లు పట్టించారు. మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుబ్బరాయుడు, ఆంజనేయ రెడ్డి, చంద్రహాసన్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, పప్పిరెడ్డి హరినాద్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, మదన్, మహబూబ్ బాషా, అజం. అన్న య్య. సహదేవ రెడ్డి. రేఖం బ్రదర్స్. చిట్టి రెడ్డి. నియాజ్. తెలుగుదేశం పార్టీ నాయకు లు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

కేశాలు దానం చేసిన 5వ తరగతి చిన్నారి

విశాలాంధ్ర-మదనపల్లె: క్యాన్సర్ భాధితులకు మానసికంగా అయిన తోడుగా నిలవాలని హెల్పింగ్ మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమంలో భాగంగా మదనపల్లి కు చెందిన రియాజ్ అలీ %ఠ% సల్మా దంపతుల కుమార్తె నైనా తస్నీన్ హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తన కేశాలను దానం చేసింది. హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకులు అబుబక్కర్ సిద్దిక్ కేశాలు దానం చేసిన నైనా తస్నీన్‌కు పూల మొక్కప్రశంస పత్రం అందించి అభినందించారు.క్యాన్సర్ భాధితులకు ఇప్పటికే 5మందికి ఉచితంగా విగ్గులు అందించి వారి వివరాలు గోప్యంగా ఉంచినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు చైతు, రష్మిక, చరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యురాలిపై విచారణ

విశాలాంధ్ర- రామసముద్రం: మండల కేంద్ర మైన రామసము ద్రం ప్రభుత్వ వైద్యురాలు లీల పై గురువారం అన్నమయ్య జిల్లా ఉప వైద్యా ధికారి శైలజ విచారణ చేపట్టారు ఇక్కడ పని చేస్తున్న యుడిసి లక్ష్మీనారాయణ డాక్టర్ లీలపై ఫిర్యాదు చేయడంతో జిల్లా వైద్యాధికారిని ఉష్‌శ్రీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు శైలజ తెలిపారు గతంలో రామసముద్రం ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసిన సిబ్బందిని విచారించారు ఉన్నతాధికారులకు విచారణ నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు ఈ విచారణలో కార్యాలయ ఓఎస్ దేవేంద్ర సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతను ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ శాఖ ద్వారా గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రాయితీల రూపంలో స్వయం ఉపాధి అవకాశాలు తక్షణమే కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి వేదిక స్టేట్ కన్వీనర్ గంజికుంట నాగరాజు ఆధ్వర్యంలో గురువారం కడప కలెక్టరేట్ కార్యాలయం నందు రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మరియు గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఒకవైపు ఉద్యోగం లేక, మరోవైపు పెళ్లిళ్లు కాక నిరుద్యోగ యువత చాలా ఇబ్బందులకు గురవుతూ అటు సొసై టీలోనూ, ఇటు కుటుంబంలోనూ తీవ్ర ఒత్తిడికి గురై చాలామంది నిరుద్యోగ యువత మనస్తా పంతో ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారని అన్నారు. తక్షణమే తమరు ప్రత్యేక చొరవ చూపించి వారికి అండగా ఉండాల న్నారు. స్పందించిన మంత్రి తక్షణమే నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించి వారికి అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది.

ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

విశాలాంధ్ర-సంబేపల్లె: ప్రజలలో ఆర్థిక అక్షరా స్యత ప్రసాదించాలని, ఆర్ హెచ్ జీబీఎం ఎస్ఎస్ ప్రతినిధి బివి రత్నం తెలిపారు. గురు వారం దేవపట్ల ప్రైమరి హెల్త్ సెంటర్ సమా వేశ భవనంలో ఆర్ హెచ్ జీబీఎంఎస్ఎస్ ఆ ధ్వర్యంలో డిఈఏ నిధుల పై హెల్త్, ఆశావ ర్కర్లకు, సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ బిఐ 2014 సంవత్సరములో డిఈఏ ఫండ్ ఏర్పాటు చేశారని దీని ద్వారా ఆర్థిక అక్షరా స్యత కల్పించడం జరుగుతుందన్నారు. బ్యాం కు ఖాతాలకు నామినీలు లేక పోవడం ఖాతా లు ఉపయోగించకపోవడం, చనిపోయిన ఖా తాదారుల వారసులకు తెలియకపోడం వంటి ఖాతాలతో పాటు పది సంవత్సరాల పాటు ఖాతాలో లావాదేవీలు జరపకపోవడం వలన ఈ ఖాతాల నిల్వలను డిఈఏ ఫండ్ కు జమ అవుతాయని తెలిపినారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ యస్.ముబారక్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళ బారిన పడకుండా జాగ్రత్తగా వుండాలని పొరపాటన పడితే సైబర్ సెల్ 1930 కు ఫిర్యాదు చేయాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా, జిల్లా నోడల్ అధికారి సుగుణ దేవపట్ల వైద్యాధికా రులు కె.రాధా, మాధవి, వైద్య సిబ్బంది సి.వెంకటేష్, యస్. మహబూబ్ బాష, పి.ప్రమీలా ఆశా వర్కర్లకు ఆర్థిక అక్షరాస్యత పైన పలు సూచనలు చేయడం జరిగింది. గ్రామీణ స్థాయిలో ప్రజలకు అక్షరాస్యత కల్పిం చలసిన బాధ్యత మీపైన ఉందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ హెచ్ జీబీఎంఎస్ఎస్ సంస్థ స్టాఫ్ జె.రాచరాయుడు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాలలో గీతాంజలి విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పదవ తరగతి ఫలి తాలలో గీతాంజలి విద్యార్థులు ప్రభంజనం సృష్టిం చారు. 10వ తరగతి ఫలితాలలో మో పూరు వెంకటలావణ్య 591 మార్కులు సాధిం చారు. అలాగే 17మంది 500 పైబడి సాధిం చగా, ఫలితాలలో 100శాతం ఉత్తీర్ణత సాధిం చినట్లు పాఠశాల ఛైర్మెన్ శ్రీయా రెడ్డి తెలిపా రు. ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యా పక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

విశాలాంధ్ర-సంబేపల్లె: గ్రామీణ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఉద్యోగు లు ర్యాలీ ఈవోపీఆర్ది సురేష్ ఆధ్వర్యంలో పం చాయతీరాజ్ ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం నుండి జాతీయ రహదారిపై ర్యా లీ చేపట్టారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను స్మరించుకున్నారు. మండల పరి షత్ అభివృద్ధి అధికారి, పరిపాలన అధికారి, మండల ప్రజా పరిషత్, ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఏప్రిల్ 24న పంచాయతి రాజ్ ఆవిర్భా వ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈ ర్యాలిలో మండల పరిషత్ కార్యాల య సిబ్బంది ఉపాధి సిబ్బంది వెలుగు సిబ్బంది పాల్గొని విజయవంతం చేసారు.

హజ్ యాత్రికులకు కర్ణాటక ఎయిర్ పోర్ట్ నుంచి అన్ని ఏర్పాట్లు

విశాలాంధ్ర-మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశానుసారం హజ్ కమిటీ చైర్మన్,మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష, ఆదేశాల మే రకు కర్ణాటక రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ జనాబ్ జిల్ఫికర్ అహ్మద్ ఖాన్ కర్ణాటక హజ్ కమిటీ సభ్యులు ఎం ఎల్ సి జబ్బార్ ముజా హిద్‌తో రాయలసీమ మత పెద్దలు మరియు హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు పఠాన్ ఖాదర్ ఖా న్ ఆధ్వర్యంలో ఆయనకి మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా త్వరలో పవిత్ర హజ్ యాత్రకు ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లే 1630మం ది హజ్ యాత్రికులకు కర్ణాటక ఎయిర్పోర్ట్ నుండి వెళ్ళే హజ్ యాత్రికులకు మౌళిక సదు పాయాలు. ఇతర సౌకర్యాలు ఏ ఇబ్బందులు లేకుండా రాయలసీమ జిల్లాల నుండి వచ్చే హజ్ యాత్రికులు కర్ణాటక నుండి వెళ్లే ప్రతి యాత్రికులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తా మని మాకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పుంగనూరు యువ నాయకు డు సోహెల్ బాషా సద్దాం హుస్సేన్ సర్కాజీ ఏజాజ్అహ్మద్ హాజీ అప్పర భాష, మరియు అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టిలో పడి నాలుడు మృతి

విశాలాంధ్ర-మదనపల్లె: ప్రమాదవశాత్తు బాలుడు నీటి తొట్టిలో పడి మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణం కోటపల్లి నివాసుడైన మోసిన్ (చోటు) మేస్త్రి తన అత్తగారి ఇల్లయిన గుర్రంకొండ కుమ్మరిపల్లి నందు తాపీ మేస్త్రి పని కొరకు భార్యాబిడ్డలతో సహా వెళ్లి గత రెండు రోజులుగా అక్కడే పని చేసుకుంటూ ఉన్నాడు. ఈ క్రమంలో మేస్త్రి చోటు కొడుకు అయాన్ 3 సంవత్సరాలు బాలుడు ఆడుకుంటూ బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమీపంలో నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన సంఘటన కుటుంబ సభ్యులు చూసి నీటి తొట్టిలో నుండి వెలికి తీసే సమయానికి బాలుడు మృతి చెందినట్లు గుర్తించి న కుటుంబ సభ్యులు చేసేదేమీ లేక పొరున విల పించుకుంటూ మృతదేహాన్ని తన స్వగ్రామమైన పీలేరు పట్టణం కోటపల్లికి బుధవారం రాత్రి తీసుకొచ్చారు విషయం తెలుసుకున్న బంధు మిత్రులు స్నేహితులు మేస్త్రి చోటు ఇంటికి చేరి పరామర్శించి బాలుడు మృతదేహాన్ని చూసి అయ్యోమని అంటున్నారు. అల్లారం ముద్దుగా సాకుకునే మూడు సంవత్సరాల కుమారుడు హఠాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదన వర్ణాతీతంగా ఉంది ఇది చూపర్లను కలిచి వేస్తోంది.

మే 20న సార్వత్రిక సమ్మె విజయవంతం చేద్దాం

- ఏఐటీయుసి పట్టణ కార్యదర్శి తిరుమలప్ప

విశాలాంధ్ర-మదనపల్లె: మున్సిపల్ ఔట్ సో ర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,రాష్ట్రంలో నెలకొన్న కార్మిక సమస్యలు పరిష్కారం చేయ డంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిం దని, ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సురేష్ కుమార్. నాగ రాజులు ఆరోపించారు . మదనపల్లి లో జరి గిన మున్సిపల్ యూనియన్ కమిటీ సమా వేశంలో ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్య క్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవం తం చేయాలని కోరారు.మేడే పోరాట స్ఫూ ర్తితో నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అను సరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్య మిద్దాం అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గ హక్కుల ను విదేశీ-స్వదేశీ పెట్టుబడిదారులకు కట్టబె ట్టిందన్నారు. కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం చేసిందన్నారు. పార్లమెంటులో ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరపకుండా యాజమా న్యాలకు కొమ్ముకాసిందని, గత నాలుగు సంవత్సరాలుగా ఈ లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశ దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ లేబర్ కోడ్లకు సంబంధించిన రూల్స్ రూపొందించబడ్డాయి. కొన్ని రాష్ట్రా ల్లో అమల్లోకి తెస్తున్నారన్నారు. ఈ పూర్వరం గంలో కార్మిక వర్గ హక్కులకు ఉరితాడులుగా మారిన ఈ నాలుగు లేబర్ కోడ్లను దేశవ్యాప్తంగా కార్మికవర్గం, రైతాంగం వ్యతిరేకిస్తూ భారత దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరారు. మున్సిపాలిటీ కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులకు పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.మేడే పోరాట స్ఫూర్తితో నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం అన్నారు. అనంతరం డైలీ వేజెస్ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకి నాలుగు నెలల పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలని మదనపల్లి మున్సిపల్ కమిషనర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పృధ్వీరాజ్, ముబారక్, వంశీ, నాగరాజు శ్రీనాథ్, శ్రీనివాసులు ఉమారాణి, భాగ్యమ్మ , శేఖర్, నందు, శంకర్ ప్రసాద్, రేణుక, ప్రమీలమ్మ, అనురాధ, రెడ్డమ్మ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నషా ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన

విశాలాంధ్ర-మదనపల్లె: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు కెరియర్ గార్డెన్ సెల్ ఆధ్వర్యంలో నషా ముక్తి భారత్ అభియాన్ అవగాహన బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా ఆర్ వి కృష్ణ కిషోర్ అసిస్టెంట్ డైరెక్టర్ అన్నమయ్య జిల్లా , ఎం ఉదయ మోహన్ రెడ్డి సెక్రటరీ వెలుగు స్కూల్, మదనపల్లి హాజరయ్యారు. ఈ కార్య క్రమంలో కృష్ణ కిషోర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వ్యక్తిగత జీవితంలోనే కాదు కు టుంబాన్ని సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తాయని,విద్యార్థులు దుష్ప్రభావాల నుంచి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. శ్రీ ఉద య మోహన్ రెడ్డి తన ప్రసంగంలో యువతపై మత్తు పదార్థాల ప్రభావాన్ని వివరించారు ఒక్కసారి మత్తు పదార్థాలకు బానిసైతే అలవాటు నుండి బయటపడటం చాలా కష్టమని అలాగే భవిష్యత్తు గురించి బాధ్యతగా ఆలోచించాలని వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ రామలింగారెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాలు విద్యార్థుల లక్ష్యాన్ని దూరం చేస్తాయని చెప్పారు ఈరోజు మీరు తీసుకునే నిర్ణయాలు రేపటి విజయానికి బాటలు వేస్తాయని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కే సతీష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై అరుణ్ కుమార్ రెడ్డి, కెరియర్ గైడెన్స్ సెల్ ఇంచార్జ్ కె ఈశ్వర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంనకు విశేష స్పందన

విశాలాంధ్ర-మదనపల్లె: జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల ఆవరణలో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరము విజయవంతమైనది ఈ శిబిరమును 130మంది హాజరై కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఇందులో 47మందిని తదుపరి కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేసుకోవడం జరిగినది తిరుపతికి తీసుకెళ్లారు. ఈ వైద్య శిబిరము స్థానిక విడో స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో జరిగినది. అరవింద్ కంటి ఆసుపత్రి ప్రోగ్రాం ఆఫీసర్ గౌరీ శంకర్ సిబ్బంది మరియు వాలంటీర్స్ పాల్గొన్నారు.

మిట్స్ విద్యార్థులకు జాతీయ స్కాలర్‌షిప్‌ను ప్రదానం

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపం లోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాల నందు ఎం.బి.ఏ మరియు ఎంసిఏ రెండవ సంవత్సరం చదువుతున్న 19 మంది విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ కోసం జాతీయ స్కాలర్‌షిప్‌ను ప్రదా నం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. రెండవ సంవత్సర ము ఎం.బి.ఏ చదువుతున్న ముగ్గురు విద్యా ర్థులకు ఒక్కొక్కరికి 1,50,000 (ఒక లక్ష యాభై వేలు) మరియు ఎం.సీ.ఏ చదువు తున్న 13 మందికి ఒక్కొక్కరికి 3,00,00 0(మూడు లక్షల రూపాయలు) మరియు ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి 1,50,00 0 (ఒక లక్ష యాభై వేలు)అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. దీని మొత్తం ?49,50,000 లుగా అందజేసినట్లు ఆయన అన్నారు. ఈ స్కాలర్‌షిప్ ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి మరియు వారి కెరీర్‌లలో రాణించడానికి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఈ స్కాలర్షిప్ లు అందజేసినట్లు ఆయన అన్నారు. స్కాలర్షి ప్‌లు పొందిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ యన్. విజయ భాస్కర్ చౌదరి మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సమీనా, మౌలాలి, అధ్యాపకులు మరియు సిబ్బంది అభినందనలు తెలియజేసారు.

వెలిగిన అక్షర దీపం

విశాలాంధ్ర - పులివెందుల: ఓ సామాన్య రైతు కుటుం బ ఇంట అక్షర దీపం వెలి గింది. టెన్త్ ఫలితాలల్లో పాఠశాల స్థాయిలో లాస్య అను విద్యార్థిని రికార్డు సృష్టించింది. సింహా ద్రిపురం మండలం కోవరంగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.లా స్య 583మార్కులు సాధించించింది. ఒక సాధారణ కుటుంబంలో నాగ సుధాకర, ర మాదేవి దంపతుల కుమార్తె లాస్య చిన్ననా టినుంచే ప్రాథమిక పాఠశాల విద్యలో అం దరికంటే ముందుండి చురుకుగా ఉంటూ అంచెలంచెలుగా తన ప్రతిభా పాటవాలను మెరుగుపరుచుకుంటూ 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ సాధించింది. గత ఫలితాలను అధికమించి 583 మార్కులను సాధించిన లాస్యకు మండల విద్యాశాఖధికారులు ఓబు లేసు, ప్రధుదాసు, ప్రధానోపాధ్యా యులు రమణమ్మ, ఉపాధ్యాయులు రామసుబ్బా రెడ్డి, అంగడి నాగేంద్ర, ఉపాధ్యాయులు సతీష్, సుధాకర్ అభినందించారు.

28న ఆర్పీల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన

- ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో పనిచేసే రిసోర్స్ పర్సన్ (ఆర్పీ) పని భారం పెంచే మహిళా కాశము యాప్‌ను రద్దు చేసి వేతనాలు వ్యక్తి గత బ్యాంకు ఖాతాలలో జమ చేయాలని ఏప్రిల్ 28 కడప కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన ఆందోళన కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసి.బాదుల్లా ఆర్పి యూని యన్ నాయకురాళ్ళు పద్మ విజయలక్ష్మీ క ళావతి విజయ విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక రాజారెడ్డి వీధిలోని ఎస్టియు కార్యా లయంలో సమావేశం నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మెప్మాలో 16 ఏళ్లుగా కనీస వేతనాలకు నోచుకోకుండా పనిచేస్తున్న ఆర్పిలను తొల గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాలపరిమితి జిఒను రద్దు చేయకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తూ అకారణంగా తొలగించేందు కు ముందుకు వస్తే చూస్తూ ఊరుకోబోవమ ని తక్షణం కాలపరిమితి జిఒను రద్దు చే యాలని డిమాండ్ చేశారు. చిరుద్యోగులైన ఆర్పిలను ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు వేధింపులకు, బెదిరింపుల కు గురిచేస్తున్నారని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆర్పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్పిలకు ఇచ్చేది తక్కువ వేతనమైనా ప్రభుత్వం లేని పోని నిబంధనలు పెట్టడంతో చాలా మం దికి రూ.ఐదు వేలకు మించి వేతనం రావ డం లేదని కనీస వేతనం 18000/- రూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్య క్రమాల మొదలుకొని ముఖ్యమంత్రి నిర్వ హించే సభలకు, కార్యక్రమాలకు మహిళల ను తరలించేందుకు ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొంటున్న ఆర్పీల సమస్యలు పరిష్కారాని కి నోచుకోవడం లేదని మరి కొంతమంది అధికారులు ఆర్పీలను ఇబ్బందులకు గురిచే స్తు లాగిన్ ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్ కోడ్ అమలు చేయాలని, వేతనాలు వ్యక్తిగత ఖా తాలలో జమ చేయాలని, ఆర్పీలందరికీ గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాల న్నారు. వెంటనే ఆర్పీల సమస్యలను ప్రభు త్వం పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తం గా ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్పీలో యూనియన్ నాయకురాలు క్రాంతి గాయత్రి వెంకట సుబ్బమ్మ రాధిక ఇందిరా చాందిని వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్య సాయిబాబా ఆరాధన ఉత్సవం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: కడప, ఎ స్బిఐ కాలనీలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన శ్రీ సత్య సాయిబాబా 15వ ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి. ముఖ్య అతిథులుగా బీ. సీ. సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి మాసా కోదండ రామ్, హాజరై మాట్లాడుతూ సత్య సాయిబాబా వారోత్సవా లు జరుపుకోవడం సంతోష్ దగ్గర విషయం అన్నారు. సత్య సాయి బాబా చేసిన సేవలు మరువలేని వన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కోయలకుంట్ల శ్రీనివాసులు, వాల్మీకి స ంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, కరీముల్లా, శివారెడ్డి, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సాయికుమార్ విచ్చేసి, స్వామి వారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యాధనం సర్వధన ప్రధానం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: బంగారం, డబ్బు, భూములు, స్థలాలు, ఇల్లు ఇలా అన్ని రకాల సంపదలకంటే విద్యా ధనం శ్రేష్టమై న ధనం అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతిని ధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. వేం పల్లిలో ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో గు రువారం శ్లోక పాఠశాల 8 వ వార్షికోత్సవం పాఠశాల కరస్పాండెంట్ నవనీశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సం దర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ గత ఎని మిది సంవత్సరాలుగా శ్లోక పాఠశాల నైతి క విలువలతో కూడిన సంస్కారవంతమైన విద్యను విద్యార్థులకు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భూపేష్ రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, ట్రిపుల్ ఐటి ఏవో రవికు మార్, విష్ణువర్ధన్ రెడ్డి, వీరారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర-రాజంపేట: రాష్ట్రవ్యాప్తంగా బుధ వారం వెలుబడిన పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ.. ద్రోణాచా ర్య మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించడం తో గురువారం అకాడమీ అధ్యక్షులు, గ్రాండ్ మాస్టర్ బి.సునీల్, ఉపాధ్యక్షులు బచోటి భా స్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భం గా వారు 10వ తరగతి పరీక్షల్లో 511 మా ర్కులు సాధించిన బాలిపోగు విష్ణువర్ధన్, 496 మార్కులు సాధించిన రైన్ బో స్కూల్ విద్యార్థి చౌడవరం చరణ్ లను గురువారం స్థానిక ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ జీవిఎంసి క్లబ్ నందు వారు శాలువాలతో ఘనంగా స న్మానించి బహుమతులు అందజేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ తమ అకాడమీ కేవలం క్రీడలనే కాక చదువులో రాణించేం దుకు పిల్లలను ప్రోత్సహిస్తామన్నారు. ముందు చదువు, తర్వాతనే క్రీడలు అనే నినాదంతో తమ అకాడమీ నినాదమని అన్నారు. క్రీడల వలన మానసిక స్థైర్యం లభిస్తుందని, తద్వారా చదువులో కూడా రాణించగలుగుతారని తెలి పారు. ఇందుకు ఈ విద్యార్థులే నిదర్శనమని పేర్కొన్నారు. విష్ణువర్ధన్, చరణ్‌లను ఆదర్శం గా తీసుకొని మిగిలిన క్రీడాకారులు క్రీడల తోపాటు చదువులోనూ రాణించాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ క్రీడా కారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హజ్ యాత్రలు వెళ్లే వారికి వ్యాధి నిరోధక టీకాలు

విశాలాంధ్ర-కడప: హజ్ కమిటీ ద్వారా పవి త్ర హజ్ యాత్రకు వెళ్లే వారికివ్యాధినిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. నాగరాజు ఆధ్వర్యంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ము రాధాకృష్ణ నగర్, పాత రిమ్స్ నందు 125 మందికి గాను 115మందికి ఉద యం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు హజ్ యాత్రికులకు వ్యాధి నిరోధక టీ కాలు వేయడం జరిగినది, ఇంకా టీకాలు వేయించుకొని హజ్ యాత్రికులకు మరల 28-04-2025వ తేదీ వ్యాధి నిరోధక టీ కాలు వేయడం జరుగుతుందని డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, డిఎల్ఏటిఓ డాక్టర్ రవిబాబు, యూపీహెచ్సి నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉబేదుల్లా, యూపి హెచ్సి వైద్యాధి కారులు డాక్టర్ సుమధుర డాక్టర్ రోషన్ జమీర్, డాక్టర్ రియాజ్ అహ్మ ద్, డాక్టర్ సుభాని, డాక్టర్ సౌమ్య పీడియా ట్రిషన్, డాక్టర్ సూర్యప్రకాష్ రెడ్డి జనరల్ ఫిజీషియన్, ఎంపిహెచ్ ఈఓ రాధాకృష్ణ, సిహెచ్ఓ మునిరెడ్డి, ఎంపి హెచ్ఎస్ రాఘ వేంద్ర, హెల్త్ఎడ్యుకేటర్ మరియకుమారి సూపర్వైజర్ మహబూబ్ బాషా, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

త్వరలో పాపాఘ్ని నదికి కృష్ణాజలాలు: బిటెక్ రవి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి సమీపంలో గల పాపాగ్ని నదికి త్వరలో కృష్ణ జలాలను తీసుకువస్తామని పులివెందుల అసెంబ్లీ టిడ పి ఇన్చార్జ్ బీటెక్ రవి స్పష్టం చేశారు. స్థా నిక టిడిపి కార్యాలయం చెంతన నూతనం గా ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను గురువారం ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియో జకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని నిం పామన్నారు. యుద్ధ ప్రాతిపదికన నంది పల్లి చెరువుకు నీటిని అందించి. అక్కడ నుంచి కాలువల ద్వారా వేంపల్లి పాపాఘ్న నదికి కృష్ణాజిల్లాలను చేరవేస్తామన్నారు. ఎండిపోతున్న పంటలకు నీరు అందించి కాపాడుతామని భరోసా ఇచ్చారు. ఫైనల్స్ ఇయర్ ఎండింగ్ కాబట్టి రోడ్డు పనులు ఆల స్యం అవుతున్నాయని, త్వరలో సీఎం చంద్ర బాబుతో మాట్లాడి కాంట్రాక్టర్లకు బిల్లులు చె ల్లించి, రోడ్డు పనులను పూర్తి చేస్తామని తెలి పారు. వేంపల్లి పాపాఘ్న నదికి నీరు వస్తే. త్రాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు.

ప్రజాహితమే బిజెపి లక్ష్యం

విశాలాంధ్ర-పులివెందుల: ప్రజాహితమే బిజెపి లక్ష్యమని ఆ పార్టీ ఏపీ మార్క్ఫెడ్ డైరెక్టరు వం గల శశిభూషణరెడ్డి, జిల్లా అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డిలు తెలిపారు. పట్టణంలో కాంగ్రెస్ నుంచి కొంత మంది బిజెపిలో చేరిన సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి పల్లెకు మోదీ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. సాంఘిక దురాచారాన్ని రూపుమాపేందుకు వ్యక్తిగత మరుగుదొడ్లకు అధిక ప్రాధాన్యతనిచ్చింద న్నారు. అలాగే గ్యాస్ కూడా ఉచితంగా అంద జేస్తోందన్నారు. బియ్యం కూడా ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. అలాగే వ్యాపార రంగాలు అభివృద్ధి చెందేందుకు జాతీయ రహదారుల నిర్మాణాలకు తొలి ప్రాధాన్యతని చ్చిందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పోరాటం చేస్తు oదని వారు వెల్లడించారు. కేతిరెడ్డి తిరుపా ల్‌రెడ్డి, శివలతో పాటు సుమారు 20 మంది దాకా బిజెపి కండువా గప్పుకున్నారు. స్వచ్చం దంగా పారీలో చేరిన వారిని బిజెపి నాయ కులు సాదరంగా ఆహ్వానించారు. తిరుపాల్ రెడ్డి, శివలు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలో విలువలు, విశ్వసనీయతలు లేవన్నారు. బిజెపి సిద్ధాంతాలు నచ్చడంతోనే తాము కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరామన్నారు.

హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

విశాలాంధ్ర-నందలూరు: మండలంలోని ఎర్ర చెరువు పల్లి గత ఏడాది జరిగిన హత్య కేసులో నిందితున్ని అరెస్టు చేసినట్లు ఏఎస్పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి వెంకటరెడ్డి, అదే గ్రామానికి చెందిన నాగ ప్రతాపరెడ్డిల మధ్య కోడిపుంజు విషయమై 2024వ సంవత్సరం జూలై 27వ తేదీన గొడవ జరిగిందని, సత్తుపల్లి వెంకటరెడ్డి ముద్దాయిని అసభ్యకరంగా తిట్టగా ముద్దాయి అతని ఇంటిలోనికి తీసుకుని వెళ్లి మచ్చు కత్తితో అతని తల మీద నరకగా వెంకటరెడ్డి మరుసటి రోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు అని అన్నారు. ముద్దాయి అప్పటినుండి పరారీ కాగా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి సూచనలు మేరకు రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే ఆధ్వర్యంలో నందలూరు పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 99/2024 యు/ ఎస్103 (1) హత్య కేసులోని ముద్దాయి గురించి రాబడిన సమాచారం మేరకు రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.వి.రమణ, నందలూరు సిబ్బందితో నాగిరెడ్డిపల్లి గ్రామంలోని పాత ఆర్ అండ్ బి బంగ్లా దగ్గర ముద్దాయి అయిన నాగ ప్రతాపరెడ్డిని అరెస్టు చేసి, ముద్దాయి దగ్గర నుండి హత్యకు ఉపయోగించిన మచ్చు కత్తిని స్వాధీనపర చుకొని రిమాండ్‌కు పంపడం జరిగిందని అన్నారు. ముద్దాయిని అరెస్టు చేసిన రాజం పేట రూరల్ సిఐ బివి రమణ, నందలూరు పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఏఎస్పి అభినందించారు.

విద్యార్థులకు క్యాష్ ప్రైజ్ అందజేసిన మంత్రి

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గురువారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ నందు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి 2024-25 అకాడమిక్ ఇయర్ లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థినులకు క్యాష్ ప్రైజ్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... విద్యార్థినీ విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్నట్లైతే వారికి మరిన్ని ప్రోత్సాహక బహుమతులు ఇస్తానన్నారు. వీరబల్లి మండలం, పెద్దవీడు గ్రామం, జడ్పీ హైస్కూల్లో చదువుతున్న మేఘన పదవ తరగతిలో 595 మార్కులు, మరియు మదనపల్లె మండల పరిధిలోని నేరుగుట్టుపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థిని బి. ధనుశ్రీ 591 మార్కులు సాధించడంతో వీరిద్దరికీ మంత్రివర్యులు క్యాష్ ప్రైజ్ అందజేశారు.

పెన్షన్ సవరణ బిల్లు ఆమోదం దుర్మార్గపు చర్య

- పింఛనుదారులపై కుట్రలు పన్నుతున్న ఎన్డిఏ ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: ఒకపక్క దేశమంతటా పాత పెన్షన్ అమలుకు ఉద్యోగుల అంతా కలిసి పోరాటం చేస్తుంటే ఇవేవీ పట్టని కేంద్రప్రభుత్వం పాత పింఛన్ దారులకు హాని చేసేలా పెన్షన్ సవరణ బిల్లు పేరిట 2025- 2026 ఆర్థిక బిల్లులో భాగంగా మార్చి25వ తేదీన గుట్టు చప్పుడు కాకుండా లోక్ సభ చేత ఆమోదింప చేసిందని ఈ బిల్లును త్వరలోనే రాజ్యసభ కూడా ఆమోదిస్తే తర్వాత రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారనుందని ఈరకంగా ఎన్నికైన ప్రజాప్రభుత్వాలే వేతన జీవులు పట్ల ఇంత కర్కశంగా వ్యవహరించడం తమను ఎంతో ఆందోళనకు గురి చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆవేదన చెందారు. వేంపల్లి రీజియన్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక చైతన్య స్కూల్ లో గురువారం నిర్వహించిన సమావేశం లో ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని,వివాద రహితంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగి హక్కుఅని చివరి దశలో ఒక సామాజిక భద్రతా పథకంఅని అటువంటి పెన్షన్ తొలగింపునకు ప్రభుత్వాలు కుట్రలు చేయరాదని లోగడ సుప్రీంకోర్టు ఎన్నోసార్లు ప్రభుత్వాలను ఆదేశించినా కుటిల నీతితో దుర్మార్గపు ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణ బిల్లు అమలులోకి వస్తే పదవీ విరమణ తేదీ ఆధారంగా పింఛనధారులు రెండు వర్గాలు అవుతారని వేతన సవరణ కమీషన్ అమలు తేదీ తర్వాత పదవీ విరమణ చెందిన వారికే కొత్త వేతన సవరణ ప్రయోజనాలు వర్తిస్తాయని ముందు పదవి విరమణ చేసిన వారికి పదవీ విరమణ ప్రయోజనాలు వర్తించవన్నారు. దీనివల్ల పింఛనుధారులు ఎంతగానో నష్టపోనున్నారని దేశంలో ఉన్న ఉద్యోగులు అందరూ సిపిఎస్ రద్దుకు ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం పాత పింఛను పొందే వారికే ఎసరు పెట్టేలా వ్యవహరించడం చేయడం ఎన్డీఏ ప్రభుత్వానికి తగదని పాలక వర్గాన్ని దుయ్య బట్టారు. ఈ సవరణ బిల్లును అమలు చేయడానికి వివిధ రాష్ట్రాలు పోటీ పడతాయని తద్వారా మన రాష్ట్రంలో కూడా భాగస్వామ్య ప్రభుత్వం ఉన్నది కాబట్టి మన రాష్ట్రంలో వెంటనే అమలు చేస్తారని దీని వలన లక్షలాది పింఛనుధారులు నష్టపోనున్నారని ఒకపక్క కార్పోరేటర్లకు అన్ని రకాల ఉపశమనాలు కల్పిస్తూ లక్షల కోట్లు మాఫీ చేస్తూ వేతన జీవులు పట్ల మాత్రం దుర్మార్గపు ఆలోచన చేస్తూ వేతన జీవుల నడ్డి విరుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై మున్ముందు పోరాటాన్ని ఉధృతం చేయవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు.పై చర్చా కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఇలియాస్ బాషా, సంగమేశ్వర రెడ్డి, ఎస్టీయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు, రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, రషీద్ ఖాన్, సుబ్రమణ్యం, రాజు, సుదాకర్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ శివారెడ్డి, రవిశంకర్ రెడ్డి, గురుకుమార్, వందలాది కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంప్రదాయాలను నిర్వహించుకోవాలి: బీటెక్ రవి

విశాలాంధ్ర-పులివెందుల: రాజకీయాల కతీతంగా మన సంస్కృతి సంప్రదాయాలను నిర్వహించుకోవాలని పులివెందుల అసెంబ్లీ టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి అన్నారు. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామంలో అమ్మవారి తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా బండలాగుడు పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. రైతులందరు రాజకీయాలతో సంబంధం లేకుండా ఈ పోటీలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలనికోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు వెంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, తొండూరు మండల పరిశీలకుడు మారెడ్డి జయ భరత్ రెడ్డి, పులివెందుల మాజీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి వేముల మండల టీడీపీ నాయకుడు అంకిరెడ్డి అంకాలమ్మ గూడురు టీడీపీ నాయకులు, అమర్నాథ్ రెడ్డి, అంకి రెడ్డి, బాబు రెడ్డి, సాంబశివారెడ్డి, శివ మోహన్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, సదాశివ రెడ్డి, గ్రామ ప్రజలు ఆలయ కమిటీ చైర్మన్ సోమ కొండారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులది పిరికిపంద చర్య

- జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర

విశాలాంధ్ర-జమ్మలమడుగు: జమ్మూ కాశ్మీర్లో పహల్గామ్ నందు జరిపిన ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం ఎదుట జనసేన పార్టీ రాయలసీమ జోన్ డాక్టర్స్ సెల్ కార్యదర్శి డాక్టర్ నల్లంశెట్టి నాగార్జున ఆధ్వర్యంలో జనసేన కన్నీటి నివాళి అర్పిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలి మానవతా దృక్పథం మేల్కొనాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ అమాయకులపై, పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం తగదన్నారు. ఉగ్రవాదం పెంచి పోషించే ఏ దేశాన్ని అయినా భారతదేశం సహించదని తెలిపారు. దేశంలోని ప్రతి భారతీయుడు ఉగ్రవాదంకు వ్యతిరేకంగా నడవాలన్నారు. ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ తరపున సానుభూతి వ్యక్తం చేస్తున్నామన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు దేశ భద్రతకు ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాయలసీమ జోన్ డాక్టర్స్ సెల్ కార్యదర్శి డాక్టర్ నల్లంశెట్టి నాగార్జున, సీనియర్ నాయకులు గడేకుల రమణ, శ్రీరామ్ వంశీ, బీదం నవీన్ కుమార్, చెన్న కృష్ణయ్య, సాదు కిషోర్, సి. సుబ్బారాయుడు, ఎల్. పవన్ కుమార్, ఉదయ్, సాయి, పుల్లయ్య, శ్రీను, ప్రసాద్, వెంకటేష్, శేఖర్ రెడ్డి, అది, నరసింహ రెడ్డి, సుధాకర్, ముష్తాక్ వలి, షేక్ వలి, సెబాస్టియన్, కొండాపురం నరసింహ, కేశవ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-రాజంపేట: రాజంపేట పట్టణం టి.అగ్రహారం చెందిన కదిరి మారయ్యకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన "లక్ష యాభైఒకటి ఐదువందల తొంబై ఐదు రూపాయల చెక్కును జనసేన పార్టీ పార్లమెంటు సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాస రాజు గురువారం లబ్దిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని అన్నారు. కూటమి ప్రభుత్వమలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని ఆదుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, రాజంపేట మండల జనసేన నాయకులు కోలాటం హరికృష్ణ, శివ శంకర్ రాజు, కొండేటి రవి కుమార్, గాజుల కుళాయప్ప, పత్తి నారాయణ, రాష్ట్ర చేనేత నాయకులు రాటాల రామయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

విశాలాంధ్ర-అట్లూరు: నేటి నుండి వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో ఈ సెలవులలో పిల్లలు వాగులు, చెరువులు, కుంటలు, బావులలో ఈత కొట్టేందుకు వెళ్లే అవకాశం ఉన్నందున పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అట్లూరు సబ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పత్రికా విలేకరులతో ఎస్సై రామకృష్ణయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు పాఠశాలలో చదువుకొని ఇంటికి వచ్చిన పిల్లలు సరదాగా గడిపేందుకు బయటకు వెళతారని అటువంటి సమయాలలో పిల్లల తల్లిదండ్రులు వారిపై నిగా పెట్టాలన్నారు. విపరీతమైన ఎండలు కాస్తున్నందున పిల్లలను బయటకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులుపై ఉందని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

వేసవి దాహాన్ని తీర్చేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

- సానపు రెడ్డి శివ కోటిరెడ్డి, సానపు రెడ్డి శ్రీనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకునేందుకు ఎంతోమందికి దాహాన్ని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని 12వ డివిజన్ కార్పొరేటర్ సానప రెడ్డి శివకోటి రెడ్డి, సానపు రెడ్డి శ్రీనాథ్ రెడ్డిలు అన్నారు. గురువారం నగరంలోని వై జంక్షన్ లో సన్నపురెడ్డి వారి కూల్ వాటర్ చలివేంద్రాను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో బస్టాండ్ ఆఫీస్ సమీపాన ఉన్న వైద్యం క్షన్లో ఎక్కువమంది ప్రజలు తిరిగే ప్రాంతమని ఇటువంటి ప్రాంతంలో చలివేంద్రాను ఏర్పాటు చేసి ప్రజల దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటు చేశామని అన్నారు. వేసవికాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మంచి నీరు అందించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ రెడ్డి, హాజీ, రామకృష్ణారెడ్డి, మనోహర్ రెడ్డి, ఆర్ ఎన్ బాబు, బాల, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ముష్కర మూకలది పిరికిపంద చర్య

విశాలాంధ్ర-జమ్మలమడుగు: ఉగ్రవాద దాడిని కాంగ్రెస్ పార్టీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్చార్జ్ సింగం శివమోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. జమ్ము కాశ్మీర్లోని పహల్గామ్ వద్ద పర్యాటకుల పై జరిగిన ఉగ్రవాద దాడిని విలేకరుల సమావేశంలో ఆయన తీ వ్రంగా ఖండించారు. ఈ దాడిని అమాయక పర్యాటకులపై కిరాతకమైన చర్యగా అభివ ర్ణించారు. ముష్కర మూకల పిరికిపంద చర్య గా పేర్కొంటూ దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో కూడా సహించరాదని చెప్పారు. పర్యాటకులను ల క్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేపట్టిన ఈ దాడిని దేశ శాంతి భద్రతలను భంగ పరిచే చర్యగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ దాడ కి మతాలు, రాజకీయాలు లేదా ఏ ఇతర భేదాలను పైకి తీసుకుకుండా, దేశవ్యాప్తంగా అందరు ఐక్యంగా పోరాడాలని శివ మోహన్ రెడ్డి అన్నారు. ఈ దాడిలో మరణించిన బాధి త కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, బాధితులకు తగిన న్యాయం జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్య లు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ దాడిలో మరణించిన వారిలో ముగ్గురు తెలుగు వాళ్ళు ఉండడం అత్యంత బాధాకరం విషయమని తెలిపారు. ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. క్షతగాత్రులందరికీ న్యాయం చేయాలని ఆయన కోరారు.

జాతీయ పంచాయతీ దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని సోమిరెడ్డి పల్లె పంచాయతీ సచివాలయం వన్ లో జాతీయ పంచాయతీ దినోత్సవం వేడుకలను పంచాయతీ కార్యదర్శి, ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధిఇన్చార్జి అధికారిగా మల్లికార్జున రావు, హాజరయ్యారు ఈ సందర్భంగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఆనాడు మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యం తేవాలని ఎంతో కృషి ఆయన తెచ్చిన గ్రామ స్వరాజ్యమే గ్రామ పంచాయతీలుగా ఏర్పడినయని ఈ గ్రామ పంచాయతీల ద్వారా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, కార్యదర్శుల దస్తగిరి, జ్యోతి సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం అంతమయ్యేవరకు ఉద్యమిస్తాం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: దేశంలో ఉగ్రవాదం అంతమయ్యే వరకు తమ వంతు పాత్రను పోషించి ఉద్యమిస్తామని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గళమెత్తారు. జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని పెహల్గాం జరిగిన ఉగ్రదాడుల్లో మరణించిన వారికి నివాళి అర్పిస్తూ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల నుండి ఎన్సిసి విద్యార్థులు, పాఠశాల విద్యార్థులతో కలిసి శాంతియుత ర్యాలీని నిర్వహించారు. ఓల్డ్ బైపాస్ సర్కిల్ వరకు జాతీయ జండాలు చేతపట్టి ర్యాలీగా వచ్చి అనంతరం అక్కడ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. దాదాపు 28 మంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్న ఉగ్రవాదులను విడిచిపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని వారు కోరారు. వారిపై కఠిన శిక్షలు వేయడంతో పాటు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకుని రావాలని వి ద్యార్థులు కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరికృష్ణ, పాఠశాల ఇంచార్జీ సంధ్య, పీఈటీ చంద్ర, ఏవో చంద్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో దాడి ఘటనపై డిఎస్పీ విచారణ

విశాలాంధ్ర-గాలివీడు: పందికుంట వీఆర్వో జయన్నపై జరిగిన దాడి ఘటనలో రాయచోటి డీఎస్పీ ఎస్.మహేంద్ర విచారణ చేపట్టారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన తాసీల్దార్ భాగ్యలత, సిబ్బందితో సమావేశమై దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.అనంతరం బాధిత వీఆర్వోతో కలిసి దాడి జరిగిన ప్రదేశంలో దాడి ఎలా జరిగిందన్న విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి స్టేట్మెంట్ రికార్డ్ చేసుకున్నారు. ఈదాడి ఘట నలో సాక్షులుగా ఉన్న సిబ్బందిని వేరువేరుగా ఒక్కొక్కరిని విచారించి సమాచారం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఈకేసులో నిందితులుగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ హేమ సుందర్ రెడ్డి ఆయన తండ్రి రామచంద్రారెడ్డిపై ఇదివరకే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈకార్యక్రమంలో ఎస్సై పి.రామ కృష్ణ, ఆర్.ఐ బాలాజీ,రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలను పరిశీలించిన తహశీల్దార్

విశాలాంధ్ర-చెన్నూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం చెన్నూరు లోని టపాసుల దుకాణాలను తాసిల్దార్ సరస్వతి తనిఖీ చేశారు. మండే ఎండలను దృష్టిలో పెట్టుకొని దుకాణ యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ కౌశిక్, లేబర్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి బక్కిరెడ్డి, ఏఎస్ఐ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి పురస్కార గ్రహీత 'మూల'కు సత్కారం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: సాహిత్య రంగంలో, నాటక రంగంలో బహుముఖ ప్రతిభను కనపరుస్తున్న ఆచార్య మూల మల్లికార్జున రెడ్డికి ప్రొద్దుటూరు చదువుల సాహిత్య కళావేదిక వారు 'నటభూషణ బిరుదు", ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ వారు తెలుగు నాటక రంగ దినోత్సవ సందర్భంగా కందుకూరి పురస్కారాన్ని అందజేయడం అభినందనీయమని కడప స్థానిక మోచంపేట సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ యస్.లక్ష్మయ్య అన్నారు. ఈ సందర్భంగా గురువారం కడప సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మల్లికార్జున రెడ్డిని ఘనంగా సత్కరించారు. స్కూలు కరస్పాండెంట్ లక్ష్మయ్య మాట్లాడుతూ ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి గత 20 సంవత్సరాలుగా మాకు పరిచయమని, మొదటినుండి ఏ పనినైనా నిబద్ధతతో చేయడం ఆయనకు అలవాటని, అనేక పర్యాయాలు మా పాఠశాలకు ఆయనను ఆహ్వానించామని, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన ఎన్నో అంశాలను విద్యార్థులకు బోధిస్తున్నారని, రాయలసీమ సాహిత్య రంగానికి, నాటక రంగానికి ఆయన చేస్తున్న కృషి అమూల్యమని, ఇలాంటి అవార్డులు ఆయనకు ఎన్ని వచ్చినా తక్కువేనని అన్నా రు. కవిగా, రచయితగా, నాటక కర్తగా, నటునిగా, నాటక దర్శకునిగా ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని, యోగివేమన విశ్వవిద్యాలయంలో నాటక విభాగానికి ఆయన చేసిన కృషివల్లే ఈరోజు జిల్లాలో ఎంతో మంది రంగస్థల కళాకారులుగా తమ ప్రతిభను చాటుకుంటున్నారని, విశ్వ విద్యాలయంలో కూచిపూడి, కర్ణాటక సంగీతం, కీబోర్డు కోర్సులు రావడానికి 'మూలే 'మూల కారణమని అన్నారు. సత్కార గ్రహీత మల్లికార్జున రెడ్డి స్పందిస్తూ స్కూలు యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశా రు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూలు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

విశాలాంధ్ర-గాలివీడు: శారీరక లోపాలున్న ప్రభుత్వ పాఠశాలల దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేసినట్లు ఐఈఆర్పీలు ఖలందర్ తెలిపారు. గురువారం రాయచోటి జిల్లా కేంద్రంలోని స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపకరణాల పంపిణీలో భాగంగా 2024-25సంవత్సరానికి గాను గాలివీడు నుండి వై.జోష్ణవి, సిద్దార్ రాజు, టి.జోహిత్,ఎం. చైత్ర,ఎమ్.అనీల్ కుమార్ నాయుడు, పి.ఓం ప్రియా రెడ్డి ఆరుగురు దివ్యాంగులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారన్నారు. అందులో భాగంగా వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ ఉపకరణాలు దివ్యాంగులకు నిత్యజీవితంలో సద్వినియోగం చేసుకోవాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ టి.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడులపై శాంతియుత నిరసన

- జనసేన జిల్లా నాయకులు జీవీ రమణ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: జమ్మూ కాశ్మీర్లో పహల్ గ్రామంలో జరిగిన అమానుషంగా ఉగ్రదాడిని ఖండిస్తున్నామని ఇది పిరికిపందల చర్య అని జనసేన నాయకులు జీవీ రమణ తెలిపారు. పవన్ కళ్యాణ్ జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మూడు రోజులు నిరసన కార్యక్రమాలు చేపట్టమన్నారు. ఈ నిరసనల్లో భాగంగా గురువారం వైయస్సార్ ప్రెస్ క్లబ్లో ఉగ్ర దాడిలో చనిపోయిన వారికి సంతాప దినాలు భాగంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా నాయకులు జీవి రమణ మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్చి చంపిన ఉగ్రవాదులను వేటాడి మట్టు పెట్టాలని కేంద్రాన్ని కోరారు ఉగ్రదాడులలో ప్రాణాలు కోల్పోయిన వారికి శాంతియుతంగా నివాళిని ప్రకటించారు. దేశంలో అశాంతిని సృష్టించాలని ఉద్దేశంతో అమాయక పర్యాటకులపై జరిపిన ఈ దాడి మానవత్వం పై జరిగిన దాడిగా భావించాలన్నారు. ఈ దారుణ ఘటన మనం ఊహించని విధంగా కుటుంబాల హృదయాలను కలిచి వేసిందన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని దేశాన్ని గర్వపడేలా చేసి ప్రజాస్వామ్య విలువల కోసం శాంతి కోసం జనసేన పోరాడుతుందన్నారు. ఈ దేశాన్ని ప్రేమించే ప్రతి పౌరుడు యువకులు మేల్కొని ఈ ఉగ్ర శక్తులకు ఎదురుగా నిలవాలని జనసేన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రవీంద్రబాబు, బలిశెట్టి సాయి, గజ్జల సాయి, ఉంగరాల విజయ్, ఆకుల గోపి, తోటా సుమన్, భరత్, ఉపేంద్ర, బాలాజీ, వినయ్, తేజ,బాబు, లోహి, రాజా తదితరులు పాల్గొన్నారు.

తిరోగమన దిశలో బాయ్స్ స్కూల్, కేజీబీవీ ఫలితాలు

- **బాయ్స్ స్కూల్లో 105 మందిలో 71 మంది ఫెయిల్**
- **కేజీబీవీ 36 మందికి 15 మంది ఫెయిల్**
- **500 మార్కులకు నోచుకోని కేజీబీవీ పాఠశాల**

విశాలాంధ్ర-గాలివీడు: 2024-25 పదవ తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో అద్భుత ఫలితాలను సాధించగా, మండల కేంద్రంలోని స్థానిక బాయ్స్ హైస్కూల్, కేజీబీవీ పాఠశాలలు మాత్రం తిరోగమన దిశలో ఫలితాల వద్ద చతికిలపడ్డారు. ఒకసారి ఫలితాలను నిశితంగా పరిశీలిస్తే బాయ్స్ హైస్కూల్లో 105మంది విద్యార్థులు పదవతరగతి పరీక్షలకు హాజరయ్యారు. అందులో 34మంది ఉత్తీర్ణత సాధించగా 71మంది ఫెయిల్ అయ్యారు. కేవలం 32శాతం ఉత్తీర్ణతతో మండలంలోనే వెనుకబడి వున్నారు. మరోవైపు కేజీబీవీ పాఠశాలలో 36మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవ్వగా,అందులో 21మంది ఉత్తీర్ణత సాధిస్తే 15మంది ఫెయిల్ అయ్యారు. వారిలో అత్యధిక మార్కులు 465కాగా, కనీసం 500మార్కులకు నోచుకోని పరిస్థితుల్లో ఫలితాలు నిలిచాయి. ఇకపోతే స్థానిక బాలికోన్న పాఠశాలలో 95మంది పరీక్షలకు హాజరవ్వగా, అందులో 25మంది ఫెయిల్ అయ్యారు. ఇలాంటి పరీక్షా ఫలితాలతో ప్రభుత్వ పాఠశాల స్థాయిని, ప్రవేశాలను ఎలా పెంచగలుగుతారో ఉన్నత విద్యాశాఖ అధికారులు సమాలోచనలు చెయ్యాలని తల్లిదండ్రులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. రాబోయే రోజుల్లోనైనా కనీసం మెరుగైన ఫలితాలు సాధించేందు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మన్నూరు గంగమ్మ తల్లిని దర్శించుకున్న చమర్తి

విశాలాంధ్ర - రాజంపేట: నారదాను మధు, తెలుగు తమ్ముళ్ల ఆహ్వానం మే రకు తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు గురు వారం మన్నూరు గంగమ్మ తల్లిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చమర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతరను ప్రజలు జరుపుకుంటారని, కావున ఈ ప్రాంత ప్రజలకు గంగమ్మ తల్లి కృప, ఆశీస్సులు సదా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాజంపేట రూరల్ అధ్యక్షుడు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షులు శివ నారాయణ చౌదరి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, వాణిజ్య విభాగం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, తెలుగు యువత నాయకులు పాండురాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10ఫలితాలలో మెరిసిన నందలూరు విద్యార్థిని

విశాలాంధ్ర-రాజంపేట: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం వెలబడిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో నందలూరు మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన గిద్దలూరు దేవసేన 578/600 మార్కులు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థిని తండ్రి గిద్దలూరు సుబ్బ నరసయ్య చిరు ఉద్యోగి అయినప్పటికీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నందలూరు మండల కేంద్రంలో ఉన్నటువంటి ఆల్విన్ మౌంట్ కార్మెల్ హైస్కూల్ చదివించినట్లు తెలిపారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగానే దేవసేన మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధువుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థిని దేవసేన మాట్లాడుతూ తల్లిదండ్రుల అందించిన సహకారంతోనే ఇంతటి మార్కులు సాధించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మంచి ఫలితాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు ఉత్తీర్ణత సాధించిన కుమార్తెకు స్వీట్లు తినిపించి సంబరాలు జరుపుకున్నారు.

బ్రహ్మంగారి గురుపూజ ఆరాధన మహోత్సవంకు ఆహ్వానం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన గురుపూజ మహోత్సవము మే4 నుండి 10వ తేదీ వరకు జరగబోయే ఆరాధన గురుపూజ మహోత్సవము హాజరుకావాలని బద్వేల్ ఆర్డీవోకు, చంద్రమోహన్ ఆయన ఛాంబర్లో బ్రహ్మంగారి ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ ప్రత్యేకంగా ఆహ్వానించి ఆయన చేతుల మీదుగా గోడ పత్రాల్లో విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు ఈ ఉత్సవములకు వివిధ రాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని ప్రత్యేకంగా ఆరాధన గురు పూజా మహోత్సవముజరుగుతాయి అన్నారు 9వ తేదీన బ్రహ్మంగారి రథోత్సవం కార్యక్రమం కూడా ఉంటుందని వారికి తెలిపారు చూస్తాల్సిన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని వారికి సూచించారు అనంతరం పలు పట్టణ ప్రాంతాలలో గోడపత్రాల ఆలయ ఫిట్ పర్సన్ విడుదల చేశారు త్వరలో బ్రహ్మంగారి ఆరాధన గురుపూజ మహోత్సవము కార్యక్రమంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని వారికి తెలిపారు డివిజన్ పరిధిలో అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని వారికి తెలిపారు.

మఠాధిపతులకు ఆరాధన మహోత్సవం

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ ప్రాంగణంలో వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఏడ వంశస్థుడు 11వ దిగవంతమఠాధిపతులకు చతుర్థ నాలుగవ ఆరాధన మహోత్సవం, కార్యక్రమాన్ని దివంగత మఠాధిపతులు కుమారుడు వెంకటాద్రి స్వామి ప్రత్యేక పూజలు కార్యక్రమాన్ని చేపట్టారు అదేవిధంగా దిగవంత మఠాధిపతులు వీర భోగ వసంత వెంకటేశ్వర స్వామి వారి ధర్మపత్ని మాత చంద్రావతమ్మ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో 8వ తరం మనవళ్ళు వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

కోనేరును ప్రారంభించిన ఎంపీ అవినాష్రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని వెలసిన శ్రీరంగనాథస్వామి ఆలయం ఆవరణంలో సుమారు రూ.65లక్షలతో నిర్మించిన కోనేరును కడప ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి గురువారం ప్రారంభించారు. ఇక్కడ చాలా కాలం నుంచి కోనేరు లేదు. ప్రస్తుతం కోనేరు అందుబాటులోకి తీసుకురావడంతో భక్తులు హర్షం వ్యక్తంచేశారు. రంగనాథ స్వామి ఆలయానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన పనులలో భాగంగా నిర్మించిన కోనేరుకు చైర్మెన్ సుధీకర్ రెడ్డి ఆధ్వర్యంలో జల హారతినిచ్చి ప్రత్యేక పూజ చేశారు. కార్యక్రమంలో ఈవో రమణ, ఆలయ కమిటీ సభ్యులు పొట్టిపాటి మాధవాచారి, సోమేశ్వరమ్మ, వాణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్, కౌన్సిలర్ మూలి మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు కోడి రమణ, రసూల్, వీరారెడ్డి, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర మౌళి, కోళ్ల భాస్కర్, బాటది ప్రసాద్, కనక గంగాధర్, పద్మనాభ రెడ్డి , విజయ్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్లో బిందులత ప్రతిభ

విశాలాంధ్ర-వేంపల్లి: టెన్త్ ఫలితాల్లో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బిందులత 579 మార్కులతో ప్రతిభ చూపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా మార్కులు సాధించడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. బిందులత ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ చదువుపై శ్రద్ధ కనబరచి ఈసారి పదోతరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిందని, నియోజకవర్గ స్థాయి హాస్టల్ విద్యార్థుల్లో టాప్ స్థానంలో నిలిచిందని ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ నాగేశ్వరమ్మ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని బిందులతను అభినందించారు.

మేడేని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మైదుకూరు: మే డే స్ఫూర్తితో ప్రపంచ కార్మికులు ఏకంకావాలని ఏపి ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రవి గోవిందా ఏఐటియుసి నాయకులు నా సుబాల ఈశ్వరయ్య గురువారం మైదుకూరు డివిజన్ ఆఫీస్ నందు కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కసవరాజు సురేష్ బాబు మాట్లాడుతూ కాంట్రాక్టు వర్కర్స్ మీద పనిభారమ్ మోపి శ్రమకు తగ్గ ఫలితం ఇయ్యకుండా రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ వస్తున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ రామకృష్ణారెడ్డి, బాలయ్య, బి.లక్ష్మీనారాయణ రెడ్డి, రమణయ్య, మల్లి తదితరులు పాల్గొన్నారు.

50శాతం రాయితీపై వేరుశనగ, మినుములు పంపిణీ

విశాలాంధ్ర-లింగాల: వేసవిలో బోర్ల కింద సాగు చేసే రైతులకు 50శాతం సబ్సిడీతో వేరుశనగ, మినుములను శుక్రవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వేసవిలో బోర్ల కింద వేరుశనగ, మినుము సాగు చేసే రైతులకు నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్- ఆయిల్ సీడ్స్ పథకం కింద 50శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తామన్నారు. సంబంధిత రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వేరుశనగ విత్తనాలు ఒక కేజీ పూర్తి మొత్తము 96రూపాయలు, అందులో సబ్సిడీ 48రూపాయలు పోను రైతువాట ఒక కేజీకి 48రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. అనగా 30కేజీల బస్తా పూర్తి ధర రూ.2880లు అందులో 1440 రూపాయలు సబ్సిడీ పోను రైతు ఒక బస్తాకు రూ.1440లు చెల్లించాల్సి ఉందన్నారు. మినుములు పూర్తి ధర ఒక కేజీకి 140రూపాయలు కాగా అందులో సబ్సిడీ 70 రూపాయలు పోను రైతు ఒక కేజీకి రూ.70లు చెల్లించాలన్నారు. మినుములు నాలుగు కేజీల ప్యాకెట్ సబ్సిడీ పోను 280 రూపాయలురైతు కట్టవలసి ఉంటుంది. వేరుశనగ, మినుము పంటలు సాగుచేసే రైతులందరూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుదాం

విశాలాంధ్ర-వాల్మీకిపురం: వాల్మీకిపురం మేజర్ పంచాయతీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుదామని జిల్లా పంచాయతీశాఖ అధికారి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచి గంగులమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి, అన్ని శాఖల అధికారుల సమక్షంలో మేజర్ పంచాయతీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, వాటి నివేదిక, చేపట్టాల్సిన పనుల ప్రణాళిక తదితర విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తెదేపా కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల, మార్కెట్కమిటీ ఛైర్మన్ చంద్రమౌళి, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచి కేశవరెడ్డి, మాజీ సర్పంచి రాజేంద్రవారి, ఎంపీడీవో మనోహరరాజు, ఈవోఆర్డీ సుధారెడ్డి, ఈవో రవీంద్రనాథ్, మహిళా సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మండలానికి మూడు పాఠశాలలు మోడల్ స్కూల్‌కు అనుమతి

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కందిమల్లాయపల్లె ఎంపీపీ స్కూల్, పెద్దిరాజు పల్లె రేకలకుంట పాఠశాలలో మోడల్ స్కూల్ గా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కల్పించడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బ్రహ్మంగారిమఠం మాజీ మండల అధ్యక్షులు ఎంపీపీ మాలే పాటి సుబ్బారావు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సమయంలో మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గం లోని బ్రహ్మంగారి మఠం అత్యంత వెనుకబడిన మండలం గా గుర్తించడం ఏ మండలాన్ని లో అభివృద్ధికి మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ అభివృద్ధికి కృషి చేస్తూ అనవరంతత మండలానికి అభివృద్ధి చేయాలని ఆకాంక్షతో రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి మండల సమస్యలను తీసుకెళ్లి ఈ మండలానికి మూడు పాఠశాలను మోడల్ స్కూల్ గా అనుమతి కల్పించడం వారికి మండల ప్రజల ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్, చెరుకూరి శ్రీధర్ ఆయన కూడా మండలం అభివృద్ధికి కృషి చేస్తున్నాడని జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా సోమిరెడ్డి పల్లె పంచాయతీలో కందిమల్లాయపల్లె ఎంపీపీయు పాఠశాల మోడల్ స్కూల్‌గా ఎంపిక, రేకలకుంట మెయిన్ స్కూల్, దిరసవంచ పంచాయతీ పెద్దిరాజు పల్లె లో ఉన్న పాఠశాలను మోడల్ స్కూల్‌గా ప్రభుత్వం అనుమతి కల్పించడం ఎక్కువ మండలంలో పేద ప్రజలు పేద విద్యార్థులు ఉన్నారని వారిని గుర్తించి పాఠశాలలను మోడల్ స్కూల్‌గా చేయడం అదేవిధంగా ఈ మండలానికి నవోదయ పాఠశాలను కూడా ప్రభుత్వం అనుమతి కల్పించడంతో మండల ప్రజలు హర్షణియాన్ని వ్యక్తం చేస్తున్నారని మాజీ మండల అధ్యక్షులు సుబ్బారావు ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం లక్కిరెడ్డిపల్లె తహసిల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజల దాహం తీర్చేందుకు ప్రజలకు అందుబాటులో చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రెడ్డయ్య యాదవ్, టిడిపి మండల యువ నాయకుడు మదన్మోహన్, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, సిద్ద వెంకటరామిరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు కొలిమి పకీరయ్య, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పహల్గాం బాధితులకు కోర్టులో సంతాపం

విశాలాంధ్ర-రాయచోటి: కాశ్మీర్లోని పహల్గాం లో 25మంది పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులందరికీ సంతాపాన్ని రాయచోటి ఐదవ అదరణ జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి నేతృత్వంలో న్యాయవాదులు తెలియజేశారు. గురువారం ఉదయం కోర్టు విధులను ప్రారంభించే ముందు ఉదయం 10:30 గంటలకు న్యాయమూర్తి కోర్టు హాల్లోనికి రాగానే పహల్గాంలో ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి రెండు నిమిషాల పాటు మౌనవహించి సంతాపాన్ని ప్రకటించాలని ఆయన న్యాయవాదులకు సూచించారు. న్యాయమూర్తితో పాటు న్యాయవాదులందరూ కూడా రెండు నిమిషాలు మౌనం వహించి దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులైన 27మందికి సంతాపాన్ని, అదేవిధంగా వారి కుటుంబ సభ్యులందరికీ కూడా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ తేజస్విని ఆయా కోర్టు హాల్స్ నందు న్యాయవాదులతో కలిసి ప్రహల్గాం బాధితులకు సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డి భాష ఉపాధ్యక్షులు ధనుంజయ్ కుమార్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

సంఘ వ్యతిరేక శక్తులపై చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో విఘాతం కల్పించే సంఘ వ్యతిరేక శక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకొని ప్రజలకు అండగా పోలీసులు ఉంటారని అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, పర్యవేక్షణలో రాయచోటి, మదనపల్లి, రాజంపేట సబ్ డివిజన్ల పరిధిలో నేడు పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి కార్డన్, సెర్చ్ నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 10మోటారు సైకిల్స్, 12లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగింది. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై 27 కేసులు నమోదు చేయడం జరిగింది. ప్రజలకు అంతరాయం కలిగించిన 7 ప్రదేశాలలో కేసులు నమోదు. ఇప్పటికి 9 చోట్ల నాకాబంది నిర్వహించడం జరిగింది. సరైన పత్రాలు లేని వాహనాలపై ఈ- చలానాలు నమోదు చేసి 1 లక్షా 9 వేల తొమ్మిది వందల 75 రూపాయలు జరిమానా విధించడం జరిగింది. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగింది. ముఖ్య ప్రదేశాలలో కార్డన్ %డ% సెర్చ్, ఆకస్మిక తనిఖీలు, వాహన తనిఖీలు, డ్రంక్ డ్రైవ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుంది. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజా జీవనానికి ఇబ్బంది కలగకుండా, అన్నమయ్య పోలీసులు నేరాలు కట్టడికి చర్యలు చేపడుతున్నారు. వేసవికాలంలో దొంగతనాలు పెరిగే అవకాశం ఉంది. మీ విలువైన వస్తువుల భద్రత కోసం ఈ క్రింద తెలిపిన కొన్ని సూచనలు పాటించాలని పోలీసు అధికారులు తెలిపారు. వేసవికాలం అయినందున ఇంటి కిటికీలు తలుపులు వేసి పడుకుంటే దొంగతనాలను నివారించవచ్చు. ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే 100/112 నెంబర్లకు గానీ, లేదా మీ స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేయండి. మీ భద్రత మాకు ముఖ్యం అని తెలియజేశారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, పిఓపిఆర్డి సురేష్ బాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు, ప్రతీ గ్రామాన్ని స్వర్ణ పంచాయతీగా మార్చి, గ్రామ స్వరాజ్ సాధించేందుకు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త సహకారంతో, సారథ్యంలో అహర్నిశలు కృషి చేస్తున్న గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత రామ జగదీష్,తెలుగుదేశం పార్టీ నాయకులు శివ రాం నాయుడు, జనసేన మ హిళా నేత రెడ్డి రాణి, రామా శ్రీనివాసులు, ఈ ఓపిఆర్డీ స్పెషల్ ఆఫీసర్ సురేష్‌బాబు, పంచాయితీ సెక్రటరీలు రామరాజు రామచంద్ర, రామ్మోహన్, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ స్వర్ణలత, సిబ్బంది, పంచాయితీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన గ్రాడ్యుయేషన్ వేడుకలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: స్థానిక మరి యాపురంలోని పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్ నందు, మరియు కాగితాలపెంట న్యూ పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కకార్యక్రమంలో విద్యార్థులు తెలుగు పద్యాలు, అరబిక్ స్పీచ్, దుఆ లో చెప్పడం జరిగింది అలాగే నాత్ కూడా పిల్లలు చక్కగా అభినయించారు. ఎస్ ఏ-2 ర్యాంకర్స్ కి మెడల్స్, సైన్స్ ఎక్స్పో లో చక్కని ప్రదర్శన చేసిన వారికీ మెడల్స్, యూకేజీ విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. అలాగే నిన్నటి దినం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 575, 520, 514, 500, 500 సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు పీస్ స్కూల్ నందు డైరెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా జరిపించిన విద్యార్థులు, తల్లిదండ్రులుమరియు ఉపాధ్యాయుల కూడా డైరెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.

ఫహల్గామాలో ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

విశాలాంధ్ర-వాల్మీకిపురం: జమ్ము- కాశ్మీర్లోని పర్యాటక కేంద్రమైన పహల్గామ్లో నిన్నటిరోజున భారతీయ పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా యువత, ప్రజాప్రతినిధులు, నాయకులు సంయుక్తంగా నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పహల్గామ్లో జరిపిన ఉగ్రవాదుల దాడి పిరికిపందచర్యన్నారు. ఈ దాడి అమాయకులైన పర్యాటకులపై జరగడం బాధకరమని, హేమీయమైన చర్యగా అభివర్ణించారు. ఈ సంఘటన యావత్తు భారతీయులను ఉలిక్కిపాటుకు గురిచేసిందన్నారు ఇలాంటి చర్యలను అడ్డుకునేందుకు భారతీయులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకట్రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి, తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, భాజపాజిల్లా కార్యదర్శి పులి నరేంద్రకుమార్రెడ్డి, అబ్దుల్ కలీం, మాజీ సర్పంచి రాజేంద్రవారి, గాంధీపేట రమణ, మైనార్టీ నాయకులు సయ్యద్బాషా, పీవీ, ఆనంద్, కేకే, అబీద్, డిష్ (బ్రదర్స్), విజయకుమార్రెడ్డి, సాధిక్, వీరభద్ర, రెడ్డి, యువత పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ నందు మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలిసి విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్స్ వినికిడి యంత్రాలు వీల్ చైర్స్ తదితర పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రై సైకిల్స్ వినికిడి యంత్రాలు వీల్ చైర్స్ వంటి పరికరాలను వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పరికరాలన్నీ విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజులలో అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా 243 మంది విభిన్న ప్రతిభావంతుల విద్యార్థిని విద్యార్థులకు ట్రై సైకిల్స్ వినికిడి యంత్రాలు వీల్ చైర్స్ తదితర పరికరాలు అందజేయడం జరిగిందన్నారు. ఇంకా అర్హత ఉన్న వారందరూ తమకు తెలియజేస్తే వెంటనే వారికి కావలసిన పరికరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఇక్కడ బోగస్‌కు తెరలేపుతున్నారు

- టీచర్ల వికలత్వం సర్టిఫికెట్‌పై పరిశీలనపైనా అనుమానాలు
- బేరసారాల్లో రిమ్స్ సిబ్బంది ఆపై వసూళ్లు
- హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ (హెచ్‌డియస్) చెందాల్సిన ఫీజు
- డబ్బులు సిబ్బంది సొంత జేబుల్లోకి

విశాలాంధ్ర–కడప: ఉపాధ్యాయ బదిలీల వికలత్వం సర్టిఫికెట్‌ల పరిశీల పైనా బోగస్ నీలినీడలు, బోగస్ వికలత్వ నిర్ధారణలు తుస్ అంతా మాయ అవుతున్నట్లు పలువురు సందేహిస్తున్నారు. వికలత్వ ధృవీకరణ సర్టిఫికెట్ల మంజూరులో అక్రమాలకు పాల్పడుతూ వస్తున్న కొందరు సిబ్బంది ఇప్పుడు టీచర్ల బదిలీల కోసం గతములో వికలత్వం, వ్యాధులు కలిగిన ఉపాధ్యాయులు వారిపై ఆధార పడిన కుటుంబ సభ్యులుసర్టిఫికెట్ల పునః పరిశీలన విషయంలోనూ చేతులు, జోబులు నింపుకొనుటకు ఈ రోజు జరిగిన మెడికల్ ఎగ్జామినేషన్ తీరు తెన్నులు నిదర్శనము అని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి బదిలీల కోసం ఏకంగా చట్టం చేయడము జరిగినది ఈ చట్టం విషయములో విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రత్యేకముగా గతములో లేనివిధంగా ప్రత్యేకముగా ఒక చట్టాన్ని తీసుకు రావడం జరిగింది. దీనికనుగుణంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రతి జిల్లాల యందు ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు బోధన, బోధనేతర సిబ్బందికి చెవుడు, మూగ, కుంటి, గుడ్డి ,అంగవికలత్వం, బుద్ధి మాంద్యము తదితర వాటితో పాటు క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధి, గుండె జబ్బులు, మొదలగు వ్యాధులు కలిగిన సిబ్బంది లేదా వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు గతములో ఉన్న వ్యాధి లేదా వికలత్వము నిర్ధారణ కొరకు ఆయా విభాగాల్లో నిష్ణాతులైన డాక్టర్ల చేత పునః పరీక్షలు జరుపుటకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.ఇందులో భాగంగా కడప జిల్లా వ్యాప్తంగా రిమ్స్ జనరల్ హాస్పిటల్ నందు ఈనెల 24 నుండి 26 వరకు మూడు రోజులు పాటు వికలత్వ పరీక్షలు మరియు వ్యాధి నిర్ధారణ పునః పరీక్షలు జరుపుటకు రిమ్స్ సూపరిండెంట్ డాక్టర్ జివి.రమాదేవి, తదితర విభాగాలు అధికారులు ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగా ఉన్నా 24/04/2025 గురువారం జరిగిన పరిశీలనలో రిమ్స్ సిబ్బంది గతంలో మాదిరిగానే చేయి తడపనిదే వికలత్వ సర్టిఫికెట్లు జారీ చేయుటకు అలవాటు లేని రిమ్స్ సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శించి ఇటు డాక్టర్‌లను అటు టీచర్లను మేనేజ్ చేసి డబ్బులు ఇచ్చిన వారికి కోరుకున్నట్లు ఇచ్చారు. ముఖ్యముగా యూనియన్ లీడర్లు, మండల విద్యాధికారులతో 2 రోజులు ముందుగానే సిబ్బంది టచ్‌లోకి వెళ్ళి చెవుడుకు ఒక రేటు, అవయవ వికలత్వముకు ఒకరేటు, వ్యాధులకు ఒక రేటు నిర్ధారించి వసూలు చేసినట్లు సమాచారం.ఇందులో ఆఫీసులో పని చేసే పెద్ద స్థాయి అధికారి మరియు సంబంధిత సెక్షన్ అధికారులు సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయుల యూనియన్ నాయకులతో, కొందరు పాఠశాల మండల అధికారులతోనూ మరి కొందరు టీచర్లతోను లాలూచి పడినట్లు తెలిసింది. రిమ్స్ పరిపాలన విభాగంలో సంబంధించిన ఆఫీస్ సిబ్బంది ఈ వ్యవహారాన్ని సాగించారు.. ఒక్కొక్కరికి ఉపాధ్యాయుల వారి స్థాయిని బట్టి వారికి ఉన్న వికలత్వాన్ని బట్టి సర్టిఫికెట్ రేటును నిర్ధారణ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.ఇలాంటి అక్రమాలకు తెరతీసిన పరిపాలన సిబ్బంది ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకం వికలాత్వ సర్టిఫికెట్‌ల పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.బోగస్ వికలత్వ సర్టిఫికెట్లు కలిగిన, బోగస్ వ్యాధుల పేరున సర్టిఫికెట్ ల ధృవీకరణ లేకుండా అధికారులు డాక్టర్లు సిబ్బంది పర్యవేక్షణ సక్రంగా ఉడాలని పలు ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం వచ్చు ప్రతి ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యులు కడప రిమ్స్ హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ నిదారణ పరీక్ష ఫీజు వెయ్యి రూపాయలు చెల్లించవలసిన నిబంధన ఉండగా రిమ్స్ సిబ్బంది పనిలో పనిగా తమ జేబులు నింపుకునే కార్యక్రమం కోసం టీచర్ల దగ్గర నుండి డబ్బులు రూపంలో వెయ్యి రూపాయలు వసూలు చేపించి హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీకి అందకుండా అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలు హెచ్ డి ఎస్ ఎకౌంటుకు బ్యాంకు ద్వారా చెల్లించవలెనని నిబంధన తుంగలో తొక్కడం జరిగినది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, రిమ్స్ పరిపాలన అధికారులు మిగిలిన రెండు రోజులైనా వికలత్వ పరీక్షలు వాస్తవము కాదు. పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటారని ఉద్యోగస్తులు కోరుకుంటున్నారు.

చలానా కాదు చేతివాటమే

మొదటి రోజు గురువారం లెక్చర్ గ్యాలరీలో టీచర్ల వికలత్వ సర్టిఫికెట్ పై పరిశీలన జరిగాయి. 190 మంది టీచర్లు వికలత్వ పరిశీలనకు వచ్చారు. వారందరు 100 రూపాయలు చొప్పున ప్రభుత్వం విడుదల జీవోలు హెచ్‌డిఎస్ బ్యాంక్ ద్వారా చలాన చెల్లించవలెను. అయితేఅధికారులు జారీ చేసిన జీవోలను తుంగలో తొక్కి రిమ్స్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది రూ.1000 అమౌంట్ చేతికి తీసుకొన్నారు.

ప్రభుత్వాలు మారినా పెత్తనం వారిదే

- తెదేపా ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ధ్వజం

విశాలాంధ్ర–యర్రగుంట్ల: నియోజకవర్గంలోని సోలార్ ప్లాంట్ల నిర్వాహకులను బెదిరిస్తున్నట్లు ఓ పత్రికలో వస్తున్న కథనాలు శుద్ధ అబద్ధమని ఆ పత్రికలో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఉదంతంలో ఎలాంటి కథనాలు ప్రచురితమయ్యాయో ఇక్కడి సోలార్ వ్యవహారం కూడా అంతేనని జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ తెదేపా బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి తేల్చి చెప్పారు. యర్రగుంట్లలో భూపేష్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఇక్కడి సిమెంటు రంగ పరిశ్రమల్లో ఇప్పటికీ వైసీపీ నేతల పెత్తనం కొనసాగుతుండడం దారుణమన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తే తమపై బురదజల్లే ప్రయత్నాలు జరగడం బాధాకరమన్నారు. ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా తాము స్థానికులకు సిమెంటు పరిశ్రమల్లో న్యాయం జరిగే వరకు పోరాడుతామని భూపేష్ స్పష్టం చేశారు.

విద్యార్థి గీతికకు వెల్లువెత్తిన ప్రశంసలు

విశాలాంధ్ర–రైల్వేకోడూరు: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో కార్పోరేట్ కు దీటుగా చిట్వేల్ రోడ్డులోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి చియ్యవరం గీతిక 600 మార్కులకు గాను 587 మార్కులు సాధించడం పట్ల స్థానికుల నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఒల్డ్ కృష్ణానగర్‌లోని విద్యార్ధిని నివాసానికి గురువారం ప్రభుత్వ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయ బృందం మందపాటి కృష్ణయ్య, ఓబుల్ రెడ్డి, ఆంజనేయులు, వంశీకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు విద్యార్ధిని నివాసానికి వెళ్లి గీతికను అభినందిస్తూ మంచి ఫలితం సాధించి బాలికల ఉన్నత పాఠశాల ప్రతిష్టను పెంచారని ప్రశంసిస్తూ శాలువా కప్పి పూల మాలవేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థిని తల్లితండ్రులకు ఉపాధ్యాయులు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి జోనల్ అధ్యక్షులు మల్లెం హేమంత్ కుమార్, ఉపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి కలసి 2000రూపాయలు నగదు బహుమతి, విలువైన షీల్డ్ అందజేసి సత్కరించి మానవత్వాన్ని చాటుకున్నారు.

వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందే వైద్య సేవలపై ప్రజలకు మరింత నమ్మకం పెంచండి
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర–లక్కిరెడ్డిపల్లె: వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది పేదలు వైద్యం పొందేందుకు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తుంటారని డాక్టర్లు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వైద్యులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. దేవుడు తర్వాత దేవుడిగా భావించే డాక్టర్లు అందరూ కూడా పేదవారి పట్ల మానవతా దృక్పథంతో మంచి వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రులలో మంచి వైద్యం అందుతుందనే నమ్మకాన్ని ప్రజలలో కల్పించాలన్నారు. లక్కిరెడ్డిపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న డాక్టర్లు సిబ్బందికి ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల యువ నాయకులు మదన్ మోహన్, ఎర్రగుడి చంద్ర శేఖర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కొండూరు వెంకట్రామ రాజు, మాజీ జడ్పిటిసి రెడ్డయ్య యాదవ్, యాగంటి పాంయ్య, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, షేక్ ఆరీఫ్, భాస్కర్ రెడ్డి, రెడ్డెమ్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర శిక్ష సహాయ మానిటరింగ్ ఆఫీసర్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర–పోరుమామిళ్ల రూరల్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంలో ఉంటూ విశేష సేవలు అందించి ఇటీవల జిల్లా సమగ్ర శిక్ష సహాయ మానిటరింగ్ ఆఫీసర్ టి.విజయభాస్కరుడు అభినందన సభ పోరమామిళ్ల మండల శాఖ అధ్యక్షులు కె.పుల్లయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీయూ సంఘంలో ఉంటూ విశేష సేవలందించి,సమగ్ర శిక్ష కడప నందు సహాయ మానిటరింగ్ ఆఫీసర్ గా మన ప్రాంత వాసి బాధ్యతలు నిర్వహించటం సంతోషంచ దగ్గ విషయమని తెలిపారు. సన్మాన గ్రహీత టి. విజయభాస్కరుడు మాట్లాడుతూ నేను సమగ్ర శిక్షలో ఉన్నంతకాలము మీకు ఏ సహాయసహకారాలు కావాలన్న పూర్తిగా అందిస్తానన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడులలో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించి, ప్రభుత్వ బడులను కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం గజమాల, శాలువా, బహుమతితో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆదరణ ప్రధాన కార్యదర్శి పి రమణారెడ్డి, రాష్ట్ర సిపిఎస్ కమిటీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం రాష్ట్ర కౌన్సిలర్ ఓ చంద్ర ఆర్సి రెడ్డి ఎస్టీయూ సీనియర్ నాయకులు బి బాలరాజు ఒక చంద్రశేఖర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఏం శేఖర్ బాబు శ్రీహరి పుల్లారెడ్డి జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ వి సత్యనారాయణ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి శ్రీనివాసులు రాజగోపాల్ రెడ్డి రీజినల్ కన్వీనర్ వీవీ కృష్ణారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు బి.యమ్. షరీఫ్, ఎం.రామకృష్ణారెడ్డి హెచ్ఎం కొండ శెట్టి ఇన్చార్జి హెచ్ఎంసి టి.జయరాములు, సి.వి.రమణ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఎం.రవీంద్రబాబు,వి.వి. నారాయణ, సి. వెంకట్ రెడ్డి, బి.యన్.వి.ప్రసాద్, రెడ్డి, బి. శ్రీనివాసులు, ఆర్థి కార్యదర్శి బి.భాష, బాల చెన్నయ్య, సదా లక్ష్మీదేవి, ఎస్.గౌసున్నిసా, జి.ప్రకాష్ రావ్, యస్.జాపర్, యమ్.గురయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర–యర్రగుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో గురువారం కేక్‌కట్ చేసి పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీరాజ్ ప్రాముఖ్యతను ఎంపీడీవో వెంకటరమణయ్య విమర్శించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య, జడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, మండల ఉపాధ్యక్షులు మల్లు మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర–చెన్నూరు: జమ్మూకాశ్మీర్‌లో అమాయకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం చెన్నూరులోని హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల ప్రజలు భారీగా పాల్గొని కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ శ్రీ సీతారామ సంకీర్తనా క్షేత్రం నుండి జాతీయ రహదారి వరకు సాగింది. అక్కడ ఐక్యవేదిక సభ్యుడు జీవన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌ను ప్రజలు ఇప్పటికైనా అర్థం చేసుకొని ఆ దేశానికి అవసరమైన వనరులను నిలిపి వేయాలన్నారు. ప్రపంచ దేశాలు ఏకతాటిపై నిలిచి ఉగ్రవాదాన్ని అంతం చేయాలని అమాయకుల ప్రాణాలు తీయడం వారిలో హిందువులా కాదా అని అడిగి మరీ చంపడం బాధాకరమన్నారు. ఏది ఏమైనా ఉగ్రవాదాన్ని అంతం చేయాలని అందుకు ప్రభుత్వాలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకోవాలి

విశాలాంధ్ర–జమ్మలమడుగు: భూసార పరీక్షలు ప్రతి రైతు తప్పనిసరిగా చేయించుకోవడం వలన రైతులకు లాభదాయకంగా ఉంటుందని అవసరం మేరకే ఎరువులను వాడుకొని పెట్టుబడులను తగ్గించుకోవచ్చని జమ్మలమడుగు మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం జమ్మలమడుగు మండలంలోని గుడెంచెరువు రైతు సేవా కేంద్ర పరిధిలోని అంబవరం గ్రామంలో వ్యవసాయ సహాయకుడు శివశంకర్ సమక్షంలో రైతుల పొలాల్లో శాస్త్రీయంగా మట్టి నమూనాలను సేకరించారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష కేంద్రం ఊటుకూరు కడప కు పంపనున్నట్లు తెలిపారు. రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య, వ్యవసాయ యాంత్రీకరణ ప్రకృతి వ్యవసాయం విధానాలపై అవగాహన కల్పించారు. జొన్న పండించిన రైతులు రాష్ట్ర పౌరసరఫర సంస్థ ద్వారా క్వింటాలు మద్దతు ధర రూ. 3371/- చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వ్యవసాయ సహాయకుడు శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ ముష్కరుల దోపిడీ అంతానికి పోరాటం

- పరిశ్రమల పనితీరుపై ఫిర్యాదు
- తనది తప్పని నిరూపిస్తే రాజకీయ సన్యాసం
- వైసీపీ భూస్థాపితం కావడం ఖాయం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే 'ఆది' సవాల్

విశాలాంధ్ర-యర్రగుంట్ల: ఎర్రగుంట్ల మండలంలోని సిమెంటు రంగ పరిశ్రమల్లో వైసీపీ ముష్కరులు దశాబ్దాల కాలంగా తిష్ట వేసి కాంట్రాక్టు పనుల పేరిట ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఈ విషయాన్ని ప్రశ్నించిన నేపథ్యంలోనే తనపై దుష్ప్రచారం జరగడం శోచనీయమని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి తెల్చి చెప్పారు. గురువారం ఆయన తెదేపా నియోజకవర్గ బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డితో కలిసి ఎర్రగుంట్లలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది మాట్లాడుతూ ఒకే పార్టీకి చెందిన వ్యక్తులకు పరిశ్రమల్లో ఆదాయ వనరులు కల్పించడం ఎంత వరకు సబబో యాజమాన్యాలే ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. పరిశ్రమల నుండి వెలువడే కాలుష్యం, సీఎస్ఆర్ నిధులను సక్రమంగా ఖర్చు చేయకపోవడం, స్థానిక యువతకు ఉపాధి కల్పించకపోవడం వంటి అంశాలపై తాము పోరాడుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇప్పటికే పరిశ్రమల పనితీరు, వైసీపీ ముష్కరుల దోపిడీపై ప్రభుత్వానికి పూర్తి వివరాలు సమర్పించడం జరిగిందని ప్రస్తుతం విచారణ దశలో ఉందని ఆయన తెలిపారు. పరిశ్రమల విషయంలో తాము తప్పుగా వ్యవహరించినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఆదినారాయణరెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడం జరుగుతుందని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణం పనులను కూడా పూర్తి చేస్తుందని ఆయన నొక్కి వొక్కాణించారు. వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని ఇప్పటి వరకు సినిమా ట్రైలర్ మాత్రమే చూశారని త్వరలోనే అసలు కథ ప్రారంభమవుతుందని ఆయన ఘాటుగా విమర్శించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ విశ్వకర్మ తరహాలో శ్రమిస్తూ ప్రపంచ పటంలో భారతదేశ స్థానాన్ని ముందుకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రస్తుతం 5వ స్థానంలో ఉన్న మనం త్వరలో 3వ స్థానాన్ని చేరుకుంటామని ఆది ఆశాభావం వ్యక్తం చేశారు. 22 కోట్ల జనాభాకు మించని పాకిస్థాన్ నిత్యం మన దేశంపై కాలు దువ్వుతూ రెచ్చగొట్టే చర్యలకు ఉపక్రమించి తుదకు జమ్మూ కాశ్మీర్‌లో అమాయక యాత్రికులను అంతమొందించడం దారుణమన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.లక్ష వంతున ఆర్థిక సాయం చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజలు జమ్మూకాశ్మీర్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు వీలుగా తాము బ్యాంకు ఖాతాను తెరువనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ఈ ఖాతాకు తమ విరాళాలు అందించడం ద్వారా వారికి భరోసా కల్పిద్దామని ఆది పిలుపునిచ్చారు. కాగా తొలుత జమ్మూ కాశ్మీర్ ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, కూటమి మండల పర్యవేక్షకులు తప్పెట్ల మధుసూదన్‌రెడ్డి, బీజేపీ మండల బాధ్యులు మేకల జగన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ మండల, పట్టణ బాధ్యులు మేకల మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఆర్.నాగరాజుతో పాటు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

రాజకీయాల కతీతంగా మండలాభివృద్ధికి కృషి చేయాలి

- ఉపాధి హామీ పథకాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించాలి
- ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె: అధికారులు, ప్రజా ప్రతినిధులు రాజకీయాలకతీతంగా సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె మండలం సర్వసభ్య సమావేశం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎంతో వెనుకబడి ఉన్న లక్కిరెడ్డిపల్లి మండలం నేడు అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. మండలంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో ఎంతోమంది పేదలకు ఉపాధి లభిస్తోందని ఇలాంటి పథకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఎంపీడీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాగా పనిచేసి పథకాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఉపాధి పథకంలో పనిచేసే వారు అవకతవకలకు పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలో ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పించాలన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 4 వేల కోట్ల రూపాయలతో గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం గ్రామాలలో మరింత అభివృద్ధి జరగాలంటే ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలన్నారు. మండలంలో పనిచేస్తున్న అధికారులకు ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసులు, ఇన్చార్జి ఎంపీడీవో ఉషారాణి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ అందివ్వడానికి అహర్నిశలు కృషి చేస్తాం

- ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ చైర్మెన్ ముక్కారూపానందరెడ్డి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: వ్యవసాయ రంగానికి, ప్రజలకు మెరుగైన విద్యుత్ అందివ్వడానికి అహర్నిశలు కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగు దేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి తనయులు సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిట్వేల్ మండలంలోని కె కందులవారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 3కోట్ల 50లక్షల రూపాయల వ్యయంతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో దశల వారీగా అనేక విద్యుత్ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామన్నారు. సమిష్టి కృషి వేగవంతమైన పనితీరుతో సత్వర ఫలితాలు సాధిస్తామన్నారు. లక్ష్య లక్ష్యాల సాధనకు సమన్వయంతో ముందుకు పోతున్నామన్నారు. ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామన్నారు. కె కందులవారిపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే కు, చైర్మన్‌కు తదితరులకు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సింగమాల రఘునాథరెడ్డి, తనయులు విశ్వనాథ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, పిఎన్ వేణు, సింగమాల చరణ్, కందుల గుండయ్యనాయుడు, రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహులు, బాలు రామాంజులు, విద్యుత్ శాఖ అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ టీమ్‌ల నమోదుకు ఈ నెల 27ఆఖరి తేదీ

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల కేంద్రంలోని క్రీడామైదానంలో స్వర్గీయ మిన్నంరెడ్డి శివారెడ్డి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జయరామ్, వెంకటేష్ లు బుధవారం తెలిపారు. ఈనెల 27వ తేదీలోపు ఆసక్తి గల క్రీడాకారులు తమ టీమ్ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సుండుపల్లె క్రీడాకారులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి 40 వేలు, ద్వితీయ బహుమతి 20 వేలు అందజేయడం జరుగుతుందన్నారు అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 9398701466 నెంబర్ కు ఫోన్ చేసి తమ టీం పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 30వ తేదీ సుండుపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమవుతుందని తెలియపరిచారు.

ఉగ్రవాదులు కాల్పుల్లో 28మంది ప్రజల దుర్మరణం పట్ల నిరసన

విశాలాంధ్ర-మైదుకూరు: మైదుకూరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 40మందికి పైగా న్యాయవాదులు ఉగ్రవాదులు నశించాలి, పాకిస్తాన్ డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తూ మోటారు సైకిల్స్ మీద కోర్టు నుండి ర్యాలీగా బయలుదేరారు. మొదట అడ్వకేట్స్ బార్‌లో కాశ్మీర్‌లోని పహల్గావ్ వద్ద అమాయక భారతీయ ప్రజలమీద విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 28మందిని పైగా హత్యలు చేసిన పాక్ ఉగ్రవాదుల దుచర్య, దుర్మార్గం, ఉన్మాద సంఘటన గురించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అడ్వకేట్స్ ప్రసంగిస్తూ ముక్తకంఠం తో ఖండించారు. అలాగే ఈ సందర్భంగా బార్ సీనియర్ సభ్యులు, బివిఎన్ శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, విజెవిఎన్ జ్వాల నరసింహ శర్మ, కొనేటి శ్రీనివాసులు, ఎం నాగిరెడ్డి, కెజె భాస్కర్ రెడ్డి, కామనూరు శ్రీనివాసులు, పివి నారాయణ రెడ్డి, బాలవెంకటయ్య, దాసరి బాబు, టి.పట్టాభి రాముడు, సిసి పుల్లయ్య, ఎం మునిరత్నం, రేవతి, ఎవి రమణ, ఎస్. ఇమామ్ భాష, ఎస్. అబ్దుల్లా, ఎస్. కరీముల్లా, ఎన్. శ్రీనివాసులు, బి. శ్రీనివాసులు, ఐ.వీరఆంజనేయులు, ఆనందకుమార్ తదితరులతో పాటు బార్ అధ్యక్షులు సోమేసుల శివప్రసాద్, జనరల్ సెక్రెటరీ ఆకుల వెంకటశివరామ్‌లు ప్రసంగించారు. అనంతరం కోర్టు హాల్ నందు మరియు బార్ హాల్‌లో మరణించిన వారికి అశ్రునివాళి ద్వారా శ్రద్ధాంజలి సమర్పించారు. తర్వాత బార్ అసోసియేషన్ సభ్యులందరూ మోటారు సైకిల్ లలో మైదుకూరు రాయల్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తూ ఉగ్రవాదుల కిరాతక చర్యలని ఖండిస్తూ నినదించారు. అలాగే అక్కడినుండి ర్యాలీగా వెళ్లి మైదుకూరు రెవెన్యూ తహసీల్దార్ వారికి మెమోరాండం సమర్పించారు.

ఘనంగా పంచాయితీ రాజ్ దినోత్సవం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా స్వర్గీయ జాతిపిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పంచాయితీరాజ్ ఇఇ రామచంద్రనాయక్, డిఇఇ తిప్పన బాలనరసింహులు, ఎంపిడిఓ సిహెచ్ నాగార్జునరావు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచులు నాయని హరికృష్ణారెడ్డి, ఆర్వీ రమణ, దార్ల చంద్రశేఖర్, ఎంపిటిసిలు బండారు మల్లిఖార్జున, పందేటి జనార్ధన్ రాజు, ఆంజనేయులు, రౌఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ మస్తాన్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్, ఇమ్రోజ్, ఖాలీషా తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఈ ఉగ్రవా దులు చేసిన చర్యను ఖండిస్తూ కడప నగ రంలో పహల్గాం ఉగ్రవాధ మూకల దాడిలో అమరులైన సామాన్య ప్రజల చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవి పాల్గొన్నారు సంఘీ భావ ర్యాలీలో కడప నగరంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని అమరులైన వారికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న దేశంలో అలజడులు సృష్టించాలని చేసిన ఈ దుష్చర్య పై ప్రజలందరూ ముక్తకంఠంతో భారత ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతూ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని దానికి దేశ ప్రజలందరూ ఒకే తాటిపై నిల్చుని ప్రభుత్వానికి తోడ్పాటు అందించడానికి సిద్ధంగా ఉన్నారని ఈ ర్యాలీ ద్వారా తెలియజేశారన్నారు. కడప నగరం 40డివిజన్లో జరిగిన ఈ సంఘీభావ ర్యాలీలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ

విశాలాంధ్ర-ఖాజీపేట: కాశ్మీర్‌లోని పహల్గావ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో అతికిరాతకంగా 28 మంది మృతి చెందడంతో ఈ సంఘటనకు నిరసనగా గురువారం సాయంత్రం వైయస్సార్ కాంగ్రెస్ రాష్ట్రపార్టీ ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నిర్వహణ అంబేద్కర్ సర్కిల్ నుంచి ఖాజీపేట బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ గా వెళ్లడంతో పాటు బస్టాండు కూడలిలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మృతుల కుటుంబాలకు నివాళులర్పించి ఐదు నిమిషాలు మౌనం పాటించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు జెడ్పిటిసి, పంచాయతీ నాయకులు మండల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా క్రొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: ఉగ్రవాద చర్యలకు ఖండిస్తూ పోరుమామిళ్ల గ్రామంలో అంజుమెన్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ముస్లిం మైనార్టీలు పాల్గొని కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన గాంధీ బొమ్మ దగ్గర చేయడం జరిగింది. తీవ్రవాదం నశించాలి హిందూ ముస్లింల ఐక్యత వర్ధిల్లాలి అని పెద్ద ఎత్తున నినదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంజుమాన్ కమిటీ ప్రెసిడెంట్ రాజీవ్ భాషా, సెక్రెటరీ హబీబ్ భాషా, భాష, దాదా పీర్ గఫార్, ముత్యాల ప్రసాద్, మొగల్ జిలాని, హసన్ ముస్లిం పెద్దలందరూ పాల్గొన్నారు.